# రైతు సమస్యలపై సెప్టెంబర్ 18న పెద్దపల్లిలో రైతు సదస్సు

- రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి
- తెలంగాణ రైతు సమస్యల సాధన సమితి

**పెద్దపల్లి, సెప్టెంబర్ 06 (వుదయం ప్రతినిధి)**

తెలంగాణలో రైతులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై సమగ్రంగా చర్చించి, వాటి పరిష్కారం కోసం భవిష్యత్ కార్యాచరణ రూపొందించేందుకు తెలంగాణ రైతు సమస్యల సాధన సమితి ఆధ్వర్యంలో సెప్టెంబర్ 18న పెద్దపల్లిలో రైతు సదస్సు నిర్వహిస్తున్నట్లు రైతు సమితి నాయకులు తెలిపారు. ఈ రోజు పెద్దపల్లి జిల్లా కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద రైతు సంఘం మరియు పౌరహక్కుల సంఘం, తెలంగాణ ప్రజా ఫ్రంట్, IFTU, రైతు కూలి సంఘం ఆధ్వర్యంలో సదస్సు కరపత్రం ఆవిష్కరణ చేశారు.ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు ముడిమడుగుల మల్లన్న, IFTU రాష్ట్ర అధ్యక్షులు కె.విశ్వనాథ్, పౌర హక్కుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు బొంకూరి లక్ష్మణ్, తెలంగాణ ప్రజా ఫ్రంట్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు గుమ్మడి కొమురయ్య లు మాట్లాడారు. సెప్టెంబర్ 18న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పెద్దపల్లిలోని ఎం.డి. గార్డెన్స్‌లో ఈ సదస్సు జరుగుతుందని ప్రధాన వక్తలుగా MLC ప్రొఫెసర్ కోదండరాం, జస్టిస్ చంద్రకుమార్, పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, ప్రొఫెసర్ ఖాసీం, రైతు స్వరాజ్య వేదిక నాయకులు కన్నెగంటి రవి ఇతర ప్రజా సంఘాల నాయకులు పాల్గొంటారని అన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లభించకపోవడం, సాగు ఖర్చులు పెరగడం, నాణ్యమైన విత్తనాలు–ఎరువులు అందుబాటులో లేకపోవడం, సాగునీటి సమస్య, పంట నష్టపరిహారం సకాలంలో అందకపోవడం, రైతులపై పెరుగుతున్న అప్పుల భారం వంటి సమస్యలు వ్యవసాయ రంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెడుతున్నాయని వారు అన్నారు.



**శాశ్వత పరిష్కారాల దిశగా**

రైతుల సమస్యలను కేవలం ఎన్నికల హామీలుగా కాకుండా శాశ్వత పరిష్కారాల దిశగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. రైతుల సమస్యలపై గ్రామస్థాయి నుంచి ఐక్య ఉద్యమాలను నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ రైతు సదస్సుకు పెద్దపల్లి జిల్లాతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి రైతులు, కౌలు రైతులు, మహిళా రైతులు, వ్యవసాయ కార్మికులు, రైతు సంఘాల ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు, యువ రైతులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచారు. ఈ కార్యక్రమంలో రైతు సమస్యల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు ముడి మడుగుల మల్లన్న, ఐఎఫ్టియు రాష్ట్ర అధ్యక్షులు కె విశ్వనాథ్, పౌర హక్కుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు బొంకురి లక్ష్మణ్, జిల్లా సహాయ కార్యదర్శి రెడ్డి రాజుల సంపత్, తెలంగాణ ప్రజా ఫ్రంట్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు గుమ్మడి కొమురయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి పులిపాక రవీందర్, జిల్లా కమిటీ సభ్యులు కాంపల్లి అంజన్న , రైతు కూలి సంఘం జిల్లా నాయకులు ఎల్ భీమన్న, ఇందారపు రాజపోషం రైతు సంఘం నాయకులు బియ్యాల స్వామి, గొట్టె లింగన్న, పెర్క బానేష్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్దపల్లి జిల్లాలో దర్జాగా అక్రమ మట్టి తవ్వకాలు, మొద్దు నిద్రలో జిల్లా యంత్రాంగం

- ఫిర్యాదులు చేసినా స్పందన కరవు
- "నేను అంధుడిని.. అధికారులు కళ్లున్నా కళ్లుమూసుకుని చూస్తున్నారు" అంటూ రాంరెడ్డి ఆవేదన

**పెద్దపల్లి, సెప్టెంబర్ 05 (వుదయం ప్రతినిధి)**

పెద్దపల్లి జిల్లాలో అక్రమ మట్టి, మొరం తవ్వకాలు, రవాణా విచ్చలవిడిగా సాగుతున్నా జిల్లా యంత్రాంగం కళ్లుమూసుకుని చూస్తోందని శాంతానగర్ రెండో వార్డుకు చెందిన సానికొమ్ము రాంరెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తాను అంధుడినైనా అక్రమ మట్టి తవ్వకాలు, రవాణాపై ఆధారాలతో పోరాడుతుంటే.. కళ్లున్న అధికారులు మాత్రం అక్రమ దందాను పట్టించుకోకపోవడం బాధాకరమని ఆయన అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాంరెడ్డి మాట్లాడుతూ.. గత నెల రోజులుగా పెద్దపల్లి ప్రాంతంలో జరుగుతున్న అక్రమ మట్టి, మొరం తవ్వకాలు, రవాణాపై సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నప్పటికీ ఎలాంటి చర్యలు కనిపించడం లేదన్నారు. రెవెన్యూ, మైనింగ్, రవాణా, పోలీసు శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు పలుమార్లు లిఖితపూర్వకంగా ఫిర్యాదులు చేశానని, వాటికి సంబంధించిన రిసిప్ట్‌లను వాట్సాప్ ద్వారా పంపించినా స్పందన లేదని తెలిపారు. పెద్దపల్లి పరిధిలో రోజుకు సుమారు 100 నుంచి 150 ట్రిప్పుల వరకు అక్రమ మట్టి రవాణా జరుగుతోందని రాంరెడ్డి ఆరోపించారు. భోంపల్లి, కన్నాల, మద్దికుంట ప్రాంతాల్లో ఉదయం ఆరు గంటల నుంచే మట్టి వాహనాల రాకపోకలు ప్రారంభమవుతున్నాయని తెలిపారు.

ఇంత పెద్ద ఎత్తున అక్రమ తవ్వకాలు, రవాణా జరుగుతున్నా జిల్లా యంత్రాంగం పట్టించుకోకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు. మైనింగ్ అధికారులకు ఫోన్ చేస్తే పోలీసులను సంప్రదించాలని, పోలీసులను ఆశ్రయిస్తే తమ పరిధి కాదన్నట్లుగా సమాధానం ఇస్తున్నారని ఆయన వాపోయారు. రూరల్ ఎస్సై, కానిస్టేబుళ్లు తమ కళ్ల ముందే మట్టి వాహనాలు వెళ్తున్నా చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. సీఐ తన ఫోన్ నంబర్‌ను బ్లాక్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. "నేను అంధుడిని.. అయినా అక్రమ మట్టి తవ్వకాలు, రవాణాపై ఆధారాలు సేకరించి అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నాను. కళ్లున్న అధికారులు మాత్రం అన్నీ కళ్లారా చూస్తూ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు?" అని రాంరెడ్డి ప్రశ్నించారు. అక్రమ తవ్వకాలు, రవాణాకు సంబంధించిన పలు ఆధారాలు తన వద్ద ఉన్నాయని, వాటిని అధికారులకు అందజేయడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. భోంపల్లి, కన్నాల గ్రామాల్లో జరుగుతున్న అక్రమ మొరం తవ్వకాలపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా వారాంతాల్లో, రాత్రి వేళల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని కోరారు. అక్రమ తవ్వకాలు, రవాణాలో వినియోగిస్తున్న టిప్పర్లు, యంత్రాలు, ఇతర పరికరాలను స్వాధీనం చేసుకుని, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు. అక్రమ మట్టి రవాణా వెనుక రాజకీయ నాయకులు, వారి పీఏల పలుకుబడి ఉందని రాంరెడ్డి ఆరోపించారు.



ఈ కారణంగానే అధికారులు చర్యలు తీసుకోవడానికి వెనుకాడుతున్నారనే అనుమానం వ్యక్తం చేశారు. పోలీసు, మైనింగ్, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేస్తే అక్రమ మట్టి రవాణాకు అడ్డుకట్ట వేయడం పెద్ద కష్టమేమీ కాదన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి రెవెన్యూ, మైనింగ్, పోలీసు, రవాణా శాఖల అధికారులతో ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్షా సమావేశం నిర్వహించాలని రాంరెడ్డి కోరారు. అక్రమ మట్టి, మొరం తవ్వకాలు, రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ప్రభుత్వ ఆదాయానికి జరుగుతున్న నష్టాన్ని అరికట్టాలని విజ్ఞప్తి చేశారు.

## కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులుగా కట్కూరి సత్యనారాయణరెడ్డి

**పెద్దపల్లి సెప్టెంబరు 06 (వుదయం ప్రతినిధి)**



భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడిగా కట్కూరి సత్యనారాయణరెడ్డి నియమితులయ్యారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు బస్వాపురం లక్ష్మీనర్సయ్య, జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన జిల్లా ఇన్‌చార్జి నాగపూరి రాజమౌళిగౌడ్, మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి, రాష్ట్ర నాయకుడు గొట్టిముక్కల సురేష్‌రెడ్డి, రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్‌తో పాటు జిల్లా నాయకులు, కిసాన్ మోర్చా నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, జిల్లాలో కిసాన్ మోర్చాను మరింత బలోపేతం చేయడంతో పాటు రైతుల సమస్యలపై నిరంతరం పోరాడుతానని సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. రైతుల సంక్షేమం కోసం పార్టీ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో విస్తృతంగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు.



## హరిపురం లక్కామరి కాపు గ్రామ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

**ముత్తారం,సెప్టెంబర్06(వుదయం ప్రతినిధి):**

ముత్తారం మండలం హరిపురం గ్రామ లక్కామరి కాపు గ్రామ కమిటీకి నూతన కార్యవర్గాన్ని గ్రామ కులస్తులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.గ్రామ అధ్యక్షుడిగా కూస రాజేందర్,ఉపాధ్యక్షుడిగా యార రాజయ్య ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో గ్రామ పెద్దలు, కులస్తులు పాల్గొని నూతనంగా ఎన్నికైన నాయకులను అభినందించారు.కులస్తుల ఐక్యతను మరింత బలోపేతం చేస్తూ,గ్రామాభివృద్ధి మరియు సామాజిక కార్యక్రమాల నిర్వహణకు కృషి చేయాలని సూచించారు.నూతన అధ్యక్షుడు కూస రాజేందర్ మాట్లాడుతూ కులస్తులందరి సహకారంతో గ్రామ సంక్షేమం కోసం పనిచేస్తానని గ్రామ ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. అనంతరం గ్రామ పెద్దలు నూతన కమిటీ సభ్యులను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో యార పెద్ద రాజయ్య,కూస తిరుపతి, యార బాపన్న,యార సతీష్,కూస సతీష్,యార సంపత్,యార విజేందర్,యార గట్టయ్య, అనుముల రాజేందర్,కూస శ్రీనివాస్,యార మధుకర్, కొంకటి మల్లయ్య,అనిల్, కూస సంపత్,యార సంపత్,కూస రాజయ్య,అనుముల సంపత్, యార సాయి రెడ్డి తోపాటు తదితరులు పాల్గొన్నారు.

## రెండు బైక్‌లు ఢీ.. ఒకరు మృతి

**మునగాల, సెప్టెంబర్ 06 (వుదయం):**

మునగాల మండలం నారాయణగూడెం గ్రామానికి వెళ్లే రహదారిపై ఆదివారం సాయంత్రం 7 గంటల సమయంలో రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఒక వ్యక్తి మృతిచెందగా, మరో ముగ్గురికి గాయాలైనట్లు సమాచారం. ఈ ప్రమాదంలో నేలమర్రి గ్రామానికి చెందిన జడిగిల మంగయ్య (42) అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిపారు. మంగయ్యతో పాటు బైక్‌పై వెనుక కూర్చున్న గంగరబోయిన వెంకన్న (38)కు తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనంపై ఉన్న వ్యక్తులకు కూడా గాయాలైనట్లు సమాచారం. సమాచారం అందుకున్న మునగాల పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు మునగాల ఎస్ఐ సంజీవ రెడ్డ తెలిపారు.



## చనుపల్లిలో ఘనంగా ముత్యాలమ్మ పండుగ వేడుకలు

**అనంతగిరి సెప్టెంబర్ 06 వుదయం**

మండలంలోని చనుపల్లి గ్రామంలో ముత్యాలమ్మ పండగను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు.భక్తులు అమ్మవారి కి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని,ప్రజలందరికీ ఆయురారోగ్యాలు,అష్టైశ్వర్యాలు కలగాలని,పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు ముస్కు మధుసూదన్ రెడ్డి,నాయకులు,గ్రామ పెద్దలు,మహిళలు,యువకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ వెయ్యి రోజుల విజయోత్సవ ర్యాలీ

**ధర్మపురిలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ**

**ధర్మపురి సెప్టెంబర్06(వు దయం ప్రతినిధి):**

ధర్మపురిలో కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన విజయోత్సవ హోరెత్తింది.మంత్రి అడ్లూరి నేతృత్వంలో ఆదివారం రాత్రి ధర్మపురి పట్టణంలో ఘనంగా విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.మంత్రి క్యాంపు కార్యా లయం నుంచి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఈ ర్యాలీని ప్రారంభించి,స్వయంగా నాయ కులు, కార్యకర్తలతో కలిసి కదలి వచ్చారు.మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న ధర్మపురి గడ్డపై జరిగిన ఈ వేడుకలకు పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చా యి.మంత్రి క్యాంపు కార్యాల యం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ ప్రధాన వీధుల గుండా సాగి పటేల్ చౌరస్తా, గాంధీ చౌక్ మీదుగా అంబేద్కర్ చౌరస్తా వరకు కొనసాగింది.దారి పొడ వునా కాంగ్రెస్ శ్రేణులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను కీర్తిస్తూ నినాదాలు చేశారు.ఈ కార్యక్ర మంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్, ధర్మపురి కాంగ్రెస్ అధ్యక్షులు చిలుముల లక్ష్మణ్, ఉపాధ్యక్షు డు వేముల.రాజేష్, మున్సిపల్ కౌన్సిలర్లు,కాంగ్రెస్ పార్టీ నాయ కులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## పెద్దపల్లిలో చెట్టుకు కట్టిన వింత బొమ్మలు కలకలం!

**చేతబడి అనుమానాలతో ప్రజల్లో భయాందోళనలు**

**పెద్దపల్లి సెప్టెంబరు 06 (వుదయం ప్రతినిధి)**

పెద్దపల్లి మండలం పెద్దకల్వల–పెద్దబొంకూర్ మధ్య చెట్టుకు బొట్లు పెట్టిన బొమ్మలు కట్టి ఉండటం కలకలం రేపింది. క్షుద్ర పూజల కోణంలో స్థానికుల అనుమానాలు. పెద్దపల్లిలో చెట్టుకు కట్టిన బొమ్మలు కలకలం! పెద్దపల్లి జిల్లాలో ఓ చెట్టుకు కట్టిన బొమ్మలు కలకలం రేపుతున్నాయి. పెద్దపల్లి మండలం పెద్దకల్వల–పెద్దబొంకూర్ మధ్య మెయిన్ రోడ్డు పక్కన ఓ చెట్టుకు కొన్ని బొమ్మలను కట్టి ఉంచారు. బొమ్మలకు బొట్టు పెట్టి ఉండటంతో ఇవి క్షుద్రపూజలకు సంబంధించినవా? అంటూ అటుగా వెళ్లే వాహనదారులు, స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అసలు ఆ బొమ్మలను అక్కడ ఎవరు కట్టారు..? ఎందుకు కట్టారు..? అనే విషయాలు మాత్రం తెలియాల్సి ఉంది. పెద్దపల్లి మండలంలోని పెద్దకల్వల–పెద్దబొంకూర్ మధ్య రోడ్డు పక్కన ఈ ఘటన కనిపించింది. చెట్టుకు పలు బొమ్మలను కట్టి, వాటికి బొట్లు పెట్టి ఉంచారు. దీంతో అటుగా రాకపోకలు సాగించే వారిలో చర్చ మొదలైంది. క్షుద్రపూజలు చేసి బొమ్మలను ఇలా కట్టారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే దీనిపై ఎలాంటి అధికారిక నిర్ధారణ లేదు. ఈ బొమ్మలను అక్కడ ఎవరు ఏర్పాటు చేశారు..? వాటి వెనుక అసలు కారణమేంటి..? అనే విషయాలపై స్పష్టత రావాల్సి ఉందని స్థానికులు ఎదురు చూస్తున్నారు.



## రోడ్లపై గణేష్ మండపాలు ఏర్పాటు చేయొద్దు

**ఎస్పీ నరసింహ**

**సూర్యాపేట, సెప్టెంబర్ 06:వుదయం ప్రతినిధి**

వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు గణేష్ విగ్రహాలను ప్రతిష్టించే ఉత్సవ కమిటీలు, భక్తులు పోలీసుల సూచనలు, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎస్పీ నరసింహ కోరారు. గణేష్ మండపాలను రోడ్లపై ఏర్పాటు చేయవద్దని, తద్వారా వాహనాల రాకపోకలకు, పౌర సేవలకు ఎలాంటి అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రోడ్లపై మండపాలు ఏర్పాటు చేయడం వల్ల వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా అంబులెన్స్‌లు, అగ్నిమాపక వాహనాలు వంటి అత్యవసర సేవల రాకపోకలకు ఆటంకం కలగకుండా మండపాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మండపాల ఏర్పాటుకు ముందుగానే పోలీసుల అనుమతి తీసుకోవాలని, మండపం ఏర్పాటు చేసే ప్రాంతం, ఉత్సవ కమిటీ వివరాలను పోలీసులకు తెలియజేయాలని అన్నారు. దీనివల్ల మండపాల వద్ద అవసరమైన భద్రతా చర్యలను పోలీసులు పర్యవేక్షించడంతో పాటు, అవసరమైన చోట పగలు, రాత్రి పోలీస్ బీట్లు, పెట్రోలింగ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. పోలీసుల వద్ద మండపం వివరాలు నమోదు చేయడం ద్వారా ప్రతి గణపతి విగ్రహానికి ప్రత్యేక నంబర్ కేటాయిస్తామని, నిమజ్జనం సమయంలో ఏ రోజు నిమజ్జనం చేసుకోవాలి, ఏ మార్గంలో వెళ్లాలి అనే విషయాలపై పోలీసుల నుంచి అవసరమైన సూచనలు, మార్గదర్శకాలు అందిస్తామని చెప్పారు. అందరూ కలిసిమెలిసి భక్తిశ్రద్ధలతో ఉత్సవాలను జరుపుకోవాలని, ఉత్సవ కమిటీలు పోలీసులతో సమన్వయం చేసుకుని నిబంధనలు పాటించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా, సురక్షిత వాతావరణంలో నిర్వహించాలని ఎస్పీ సూచించారు.




## ఎస్సీ స్టడీ సర్కిల్ భవనం నుంచి దూకి విద్యార్థి ఆత్మహత్య

- టిఫిన్‌కు వెళ్దామని స్నేహితులకు చెప్పిన కాసేపటికే అఘాయిత్యం
- ఘటనపై కేసు నమోదు.. కారణాలపై దర్యాప్తు

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 6 (వుదయం ప్రతినిధి):**



ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఆదివారం విషాద ఘటన చోటుచేసుకుంది. ఫౌండేషన్ కోర్సులో శిక్షణ పొందుతున్న మంచిర్యాల జిల్లాకు చెందిన విద్యార్థి స్వామిరామం భవనం మూడో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనతో స్టడీ సర్కిల్‌లోని విద్యార్థులు, సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. మంచిర్యాల జిల్లాకు చెందిన స్వామిరామం గత నాలుగు నెలలుగా ఆదిలాబాద్‌లో ఉంటూ ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఫౌండేషన్ కోర్సు శిక్షణ పొందుతున్నాడు. ఆదివారం ఉదయం స్నేహితులు టిఫిన్‌కు రావాలని పిలవగా వస్తానని చెప్పిన కాసేపటికే భవనం మూడో అంతస్తు నుంచి కిందకు దూకాడు. తీవ్ర గాయాలపాలైన అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. విద్యార్థి ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉండగా, పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

## కన్న తండ్రిపై మమకారం.. జ్ఞాపకార్థం విగ్రహ ప్రతిష్ఠాపన

**మంచిర్యాల/ రామకృష్ణాపూర్/ సెప్టెంబర్ 06 (వుదయం ప్రతినిధి)**

తండ్రిపై ఉన్న ప్రేమాభిమానాలను చాటుకుంటూ కుమారుడు తన దివంగత తండ్రి జ్ఞాపకార్థం విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఆదర్శంగా నిలిచారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని అమరవాది గ్రామానికి వెళ్లే దారిలో దివంగత అందుగుల రాములు విగ్రహాన్ని ఆయన కుమారుడు శ్రీనివాస్ తల్లి, బంధుమిత్రుల సమక్షంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ఆవిష్కరించారు. తండ్రి జ్ఞాపకాలు ఎప్పటికీ పదిలంగా ఉండాలనే ఉద్దేశంతోనే విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు పాల్గొని రాములు సేవలను స్మరించుకున్నారు.



## ఆధ్యాత్మిక గురువుకు ఘన నివాళి

**మంచిర్యాల/ రామకృష్ణాపూర్/ సెప్టెంబర్ 06( వుదయం ప్రతినిధి)**

ధర్మ సంస్థాపన జ్ఞానపీఠం వ్యవస్థాపకులు సన్యాస రామ ఋషి (అవధాని) ఆకస్మిక మృతికి సంతాపంగా రామకృష్ణాపూర్‌లో ఆదివారం సంతాప సభ నిర్వహించారు. శిష్య బృందం ఆధ్వర్యంలో బి జోన్ వర్తక వాణిజ్య సంఘం గణపతి నవరాత్రుల మండపం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేపట్టారు.ఆధ్యాత్మిక గురువు చూపిన సన్మార్గంలో ఎంతోమంది జీవితాలను మార్చుకున్నారని, భవిష్యత్ తరాలకు ఆధ్యాత్మికత ఎంతో అవసరమని శిష్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో శిష్యులు, అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.



## ఎలక్ట్రానిక్ మీడియా నాయకులకు సన్మానం



**జన్నారం, సెప్టెంబర్ 6 (వుదయం విలేఖరి)**

జన్నారం మండల కేంద్రంలో లక్షెట్టిపేట సర్కిల్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన నిజామోద్దీన్, ఉపాధ్యక్షులుగా ఎన్నికైన నిమిషకవి రాజేష్‌లను, ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జన్నారం పట్టణంలో ఆదివారం రోజున వారిని పలువురు నాయకులు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో రేండ్లగూడ సర్పంచ్ అల్లం రవి, మాజీ ఎంపీటీసీ రియాజుద్దీన్, పెరిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దాసరి తిరుపతి, విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షులు వేయికండ్ల రవి చారి, బంజారా సంఘం జిల్లా నాయకులు రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జర్నలిస్టు డే వేడుకలు

**ఆసిఫాబాద్ ( వుదయం ప్రతినిధి)**

ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ముస్లిం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో జర్నలిస్టు డే వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. సమాజ శ్రేయస్సు కోసం విలేకరులు అందిస్తున్న సేవలను గుర్తించి, ఉత్తమంగా పనిచేస్తున్న జర్నలిస్టులు అబ్దుల్ రహమాన్, ప్రకాష్ గౌడ్, బాల శ్రీనివాస్, మసాదే సంతోష్ కుమార్, నగరారే తారు, మీర్జా సలీం బేగ్, సురేష్ చారి, మోయిన్, ముబాషీర్, అబ్దుల్ గఫ్ఫార్, సాజిద్ ఖాన్‌లను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అబ్దుల్లా, ముస్లిం వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు ఉబేద్ బిన్ యహియలు మాట్లాడుతూ జర్నలిజం కత్తి మీద సాము లాంటి అత్యంత సవాలుతో కూడుకున్న వృత్తి అని, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తూ సమాజానికి సేవలందించడం అభినందనీయమని కొనియాడడమే కాకుండా, జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అడ్వైసర్ అహ్మద్ బిన్ అబ్దుల్లా, అవద్ బిన్ యహియ, సొసైటీ ప్రతినిధులు ఇమ్రాన్ హష్మీ, సల్మాన్ ఖాన్, మన్సూర్, షఫీ తదితరులు పాల్గొన్నారు.



## భర్త అనారోగ్యం, కుటుంబ సమస్యలతో మహిళ ఆత్మహత్య

**నల్లబెల్లి, సెప్టెంబర్ 6 ( వు దయం):**

తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న భర్త పరిస్థితిని చూసి తట్టుకోలేక, కుటుంబ సమస్యలతో మనస్తాపం చెందిన ఓ మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషాద సంఘటన నల్లబెల్లి మండలంలోని నారక్కపేట గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం. నారక్కపేట గ్రామానికి చెందిన నౌగిరి రాధాబాయి (58) భర్త రాజలింగం కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. భర్త ఆరోగ్య పరిస్థితి క్షీణించడం, దానికితోడు కుటుంబంలో ఆర్థిక, మానసిక సమస్యలు తీవ్రం కావడంతో రాధాబాయి గత కొన్ని రోజులుగా తీవ్ర మనస్తాపానికి గురైంది. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో మధ్యాహ్నం పురుగుల మందు తాగింది. విషయం గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను ఆటోలో నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ మధ్యాహ్నం సుమారు 2.00 గంటల సమయంలో పరిస్థితి విషమించి ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.ఘటనపై సమాచారం అందుకున్న నల్లబెల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహానికి పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు. అనంతరం తదుపరి దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు.



## ఓటరు జాబితా సవరణ ప్రక్రియను వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ ఆదేశాలు**

**మహబూబాబాద్, సెప్టెంబర్ 06 (వుదయం ప్రతినిధి) :**

రాష్ట్ర ఎన్నికల సంఘం (SEC) సూచనల మేరకు మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR – స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమం విస్తృతంగా కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని అన్ని మండలాలు, మున్సిపల్ వార్డులలో ఓటరు జాబితాకు సంబంధించి అభ్యంతరాలు, చేర్పులు మరియు మార్పుల కోసం ఫారమ్ 6, 7, 8 ద్వారా దరఖాస్తులను అధికారులు స్వీకరిస్తున్నారు. జిల్లా కలెక్టర్ గారి ప్రత్యేక ఆదేశాల మేరకు ఇనుగుర్తి, నరసింహారావుపేట, సిరోలు, డోర్నకల్, గూడూరు, మహబూబాబాద్ మండలాల్లో తహసీల్దారులు, ఎన్నికల అధికారులు, బూత్ లెవెల్ ఆఫీసర్లు (BLO) క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉన్నారు. ఇదివరకే షెడ్యూల్ ప్రకారం నోటీసులు అందుకున్న ఓటర్ల నుంచి వివరాలు, అభ్యంతరాల ఫారమ్‌లను సేకరిస్తున్నారు. స్వీకరించిన దరఖాస్తులను ఎన్నికల నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని సంబంధిత అధికారులు స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని, జాబితాలో తప్పులుంటే సవరించుకోవడానికి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అధికారులు సూచించారు.

# వెయ్యి రోజుల కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై బీఆర్ఎస్ నిరసన



**మున్సిపల్ సమస్యలు వెంటనే పరిష్కరించాలి: ఉప్పు రాజ్ కుమార్**

**పెద్దపల్లి, సెప్టెంబర్ 06 (వుదయం ప్రతినిధి)**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గారి పోరుబాట పిలుపు మేరకు, బీఆర్ఎస్ పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి గారి ఆదేశానుసారం పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు ఉప్పు రాజ్‌కుమార్ మాట్లాడుతూ పెద్దపల్లి పట్టణంలో డ్రైనేజీల్లో ప్లాస్టిక్, చెత్త పేరుకుపోవడం, మురుగునీరు పొంగిపొర్లడం, పనిచేయని స్ట్రీట్ లైట్లు, స్మశాన వాటికల్లో పిచ్చి మొక్కలు, ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాల మైదానాల అపరిశుభ్రత వంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో విఫలమైందని, మున్సిపల్ సమస్యలపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. సమస్యలు పరిష్కరించకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మరింత ఉధృతంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. మాజీ కౌన్సిలర్ బిక్షపతి మాట్లాడుతూ గత బీఆర్ఎస్ పాలకవర్గం హయాంలో పట్టణ అభివృద్ధికి చేపట్టిన పనుల నిర్వహణను ప్రస్తుత పాలకవర్గం సక్రమంగా చేపట్టడం లేదని విమర్శించారు. అనంతరం జెండా చౌరస్తాలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల బకాయిలను బాకీ కార్డుల రూపంలో పంపిణీ చేశారు.

ఇట్టి కార్యక్రమంలో కౌన్సిలర్ వెన్నం సుజాత రవీందర్, మాజీ కౌన్సిలర్లు పెంచాల శ్రీధర్, పూదరి చంద్రశేఖర్, నాంసాని సరేష్ బాబు, ఎండీ ఖదీర్ ఖాన్, మాజీ కో–ఆప్షన్ సభ్యులు రామగిరి చంద్ర మౌళి, ఎండీ ఫహీం, బీఆర్ఎస్ కౌన్సిలర్ కాంటెస్ట్ అభ్యర్థులు లవన్ కుమార్, కిషోర్, జుబేర్, మహేష్, శ్యాంబాబు, వార్డు అధ్యక్షులు గండు రంగయ్య, కాశిపాక వాసు, వైద శ్రీనివాస్, నాయకులు ముఖీమ్, పల్లె మధు, నుగిళ్ల వీరేశం, అతిక్, ముబసీర్, అఫ్జల్ బాబా, రైతు నాయకులు సొల్లూరి రాజిరెడ్డి, యువజన నాయకులు అజార్, పెంచాల శ్రీకాంత్, పూదరి శేఖర్, పిట్టల మహేష్, పిట్టల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు ఐక్యత చిహ్నంగా స్వశక్తి సంఘాలకు బలోపేతం

**చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**

**రామడుగు,సెప్టెంబర్06( వుదయం ప్రతినిధి)**



రామడుగు మండలం దేశ రాజ్ పల్లి గ్రామంలో గ్రామపంచాయతీ బిల్డింగ్ 20, లక్షలు విశ్వబ్రాహ్మణ సంఘం 4,16,000 అనంతరం రామడుగు గ్రామాల్లో 50 లక్షలతో నిర్మిస్తున్న మహిళ సమైక్య భవనానికి ఈ ఆర్ వో భవనానికి 24 లక్షల నిర్మిస్తున్న భవనానికి చొప్పదండి నియోజకవర్గం శాసనసభ్యులు డాక్టర్ మేడిపల్లి సత్యం ముఖ్యఅతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు.అనంతరం ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్ కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు ఈ సందర్భంగా చొప్పదండి నియోజకవర్గం శాసనసభ్యులు డాక్టర్ మేడిపల్లి సత్యం మాట్లాడుతూ గ్రామాల్లో మౌలికసదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధి ద్వారా ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు.ఒకవైపుఅభివృద్ధి, మరొక వైపు సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయం అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రం అభివృద్ధిలో ముందుకు వెళ్తుందన్నారు. అన్నివర్గాల సంక్షేమం కాంగ్రెస్ పార్టీ ధ్యేయం అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో ముందుకు వెళ్తున్నామన్నారు. మహిళలకు ఐక్యత చిహ్నంగా స్వశక్తి సంఘాలకు బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోటి మంది మహిళల్ని కోటీశ్వరులను చేయడానికి ముందుకు వెళ్తున్నట్టు తెలిపారు. ఇప్పటి వరకు మహిళా సంఘాలకు 26 వేల కోట్లు బ్యాంకుల ద్వారా వడ్డీలేనిరుణాలుఅందించామన్నారు.మహిళలనుఅన్నిరంగాల్లో అభివృద్ధి చేయడానికి రేవంత్ సర్కార్ కృషిచేస్తున్నట్లు తెలిపారు. నేతన్నలకు పనికల్పిస్తూ, మహిళల ఆత్మగౌరవంపెంచుతున్నామన్నారు. రామడుగు మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధిపథంలోతీసుకెళ్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమాల్లో ఎంపీడీవో రాజేశ్వరి, ఎమ్మార్వో రాజమల్లయ్య, రామడుగు ఎస్సె రాజు, ఏఎంసి చైర్మన్ తిరుమల తిరుపతి, రామడుగు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జవ్వాజి హరీష్, సింగిల్ విండో చైర్మన్ కోల రమేష్, సర్పంచ్‌లు ఎలకపెల్లి దేవమ్మ లచ్చయ, ఎండీ.మొయిజ్, వీర్ల నర్సింగరావు, నునుకొండ అంజలి, మల్లేశం, అనంతరెడ్డి, వనజ నరేందర్ రెడ్డి, మల్లేశం, మాజీ మార్కెట్ చైర్మన్ ఉప్పల అంజన్న ప్రసాద్, వైస్ చైర్మన్ పిండి సత్యం, జిల్లా కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలు కర్ర సత్య ప్రసన్న రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షులు పులి ఆంజనేయులు గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కాడ శంకర్, పంజాల శ్రీనివాస్, తౌంటి శేఖర్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ముత్యం శంకర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు అనుపురం పరశురామ్ గౌడ్, మండల మైనార్టీ అధ్యక్షులు అసిఫ్ మండలం కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ జవ్వాజి అజమ్, కత్తి మధు, ఈశ్వర్,14వ వార్డు సభ్యులు సిరికొండ పల్లవి సాయి, కర్ణ శ్రీనివాస్ వివిధ గ్రామాలకు సంబంధించిన సర్పంచులు,ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, మహిళ సంఘాల సభ్యులు, గామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# గోవుల సంరక్షణకు గోశాల ఏర్పాటు అభినందనీయం..

**మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్**

**జగిత్యాల సెప్టెంబర్ 06 (వుదయం ప్రతినిధి)**



జగిత్యాల పట్టణ సాయిబాబా గుడి ఎదురుగా శ్రీ లక్ష్మి సాయి అపార్ట్మెంట్ వాసులు ఏర్పాటు చేసిన గోశాలను జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ ఆదివారం సందర్శించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గోవుల సంరక్షణ కోసం అపార్ట్మెంట్ వాసులు గోశాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు గోవులను సంరక్షించడం మన సంస్కృతి సంప్రదాయాల్లో ముఖ్యమైన భాగమని పేర్కొన్నారు గోశాల నిర్వహణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని ఆమె కోరారు గోవులకు అవసరమైన ఆహారం నీరు.వైద్యం వంటి సౌకర్యాలను కల్పిస్తూ వాటి సంరక్షణకు కృషి చేస్తున్న శ్రీ లక్ష్మి సాయి అపార్ట్మెంట్ వాసులను ఆమె అభినందించారు ఇటువంటి సేవా కార్యక్రమాలు సమాజంలో మరింతగా విస్తరించాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ వేముల శ్రీనివాస్ అపార్ట్మెంట్ వాసులు స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# రసమయి నోరు అదుపులో పెట్టుకో లేకపోతే నాలుక కోస్తాం తస్మాత్ జాగ్రత్త

**కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి టేకుల శ్రావణ్**

**కరీంనగర్ సెప్టెంబర్ 06 (వుదయం ప్రతినిధి):**



మానకొండూర్ శాసనసభ్యులు డాక్టర్.కవ్వంపల్లి సత్యనారాయణ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని లేకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి టేకుల శ్రావణ్ హెచ్చరించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ మానకొండూర్ మాజీ శాసన సభ్యుడు రసమయి బాలకిషన్ ఒక చదువుకున్న అజ్ఞాని అని చదువుకు తగ్గ సంస్కారం లేని సంస్కార హీనుడని మండిపడ్డారు.మచ్చలేని కవ్వంపల్లి కుటుంబం పై అర్థరహిత విమర్శలు చేసే ముందు ఒళ్ళు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని హెచ్చరించారు. కవ్వంపల్లి తల్లిదండ్రులు మున్సిపాలిటీ లో పనిచేసి పోషించారని వారి పోషణ పట్ల కూడా పోషించే విధానాన్ని కించపరిచి దళితుల మరియు మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీల్లో పనిచేసే కార్మికులను సైతం కించపరిచే విధంగా మాట్లాడిన నీకు సరైన బుద్ధి చెప్తామని అన్నారు. ఉద్యమ సమయంలో గోషి, గొంగళి తో వచ్చి మానకొండూర్ టికెట్ కోసం కెసిఆర్ కుటుంబాన్ని బెదిరించి వారికి వ్యతిరేకంగా పాటలు పాడతానని సావు డప్పు కొడతానని బెదిరింపులకు గురి చేసింది నిజం కాదా? మొదటి నుండి నీ బ్రతుకంత బెదిరిపులేనని, నువ్వు సాంస్కృతిక సారథిగా ఉన్న సమయంలో ఎంతో మంది ఉద్యమ కారుల పొట్టకొట్టావని నిజమైన కళాకారులను మోసంచేసి,నకిలీ ఉద్యమ కారులకు ఉద్యోగాలు అమ్ముకున్న చరిత్ర నీది అలాంటి చరిత్ర కలిగిన నువ్వు కవ్వంపల్లి కుటుంబం గురుంచి అడ్డగోలుగా మాట్లాడితే సహించేది లేదని కవ్వంపల్లి కుటుంబ సభ్యుల కాలిగోటితో సమానం నువ్వు , ఉద్యోగాల పేరిట ఎంతో మంది అమాయక అమ్మాయిల జీవితాలతో ఆడుకున్న ఒక మూర్ఖుడివి నువ్వా కవ్వంపల్లి విమర్శించేది ఖబర్దార్ బిడ్డ ఇంకోసారి కవ్వంపల్లి గారి గురించి అడ్డగోలుగా విమర్శిస్తే నాలుక చిరుతామని మూర్ఖుడిలా ప్రవర్తిస్తే అదే రీతిలో ఘాటైన సమాధానం చెబుతామని హెచ్చరించారు. ఉద్యమ సమయంలో చెప్పులు గతిలేని నీకు ఫామ్ హౌస్ లు, కోళ్ల ఫారాలు, ఎకరాల కొద్ది భూములు ఎలా వచ్చాయో తెలపాలని డిమాండ్ చేశారు.

# కేసీఆర్ హయాంలో పల్లెలు అభివృద్ధి

- కాంగ్రెస్ పాలనలో పారిశుధ్యం పడకేసింది
- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

**కోరుట్ల సెప్టెంబర్ 06 (వుదయం ప్రతినిధి)**

కోరుట్ల మండలం అయిలాపూర్ గ్రామంలో కోరుట్ల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఆధ్వర్యంలో స్వచ్ఛత శుభ్రత కార్యక్రమం చేపట్టారు కేసీఆర్ హయాంలో తెలంగాణ పల్లెలు అభివృద్ధి పారిశుధ్యంలో దేశానికే ఆదర్శంగా నిలిచాయని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల అభివృద్ధి పారిశుధ్య నిర్వహణ పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ విమర్శించారు పల్లెల్లో పారిశుధ్య సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైన తీరును నిరసిస్తూ అయిలాపూర్ గ్రామంలో ఎమ్మెల్యే సంజయ్ ఆధ్వర్యంలో ఆదివారం శ్రమదానం కార్యక్రమం నిర్వహించారు కేసీఆర్ హయాంలో పల్లె ప్రగతి కార్యక్రమాలతో గ్రామాల్లో పారిశుధ్యనికి ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చి గ్రామాల రూపురేఖలు మార్చామని ఎమ్మెల్యే గుర్తు చేశారు నేడు కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో గ్రామాల్లో చెత్త మురుగు అపరిశుభ్రత సమస్యలు పెరిగాయన్నారు అధికార కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను పల్లెల పట్ల చెబుతున్న నిర్లక్ష్యాన్ని తీవ్రంగా ఎండగట్టారు దేశంలో దాదాపు 6 లక్షల గ్రామాలు ఉండగా ఉత్తమ గ్రామాల విభాగంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 40 అవార్డుల్లో 13 అవార్డులను 33 శాతం సాధించి తెలంగాణ రాష్ట్రంలో అగ్ర స్థానంలో నిలిచిందన్నారు నాడు కేసీఆర్ నాయకత్వంలో పల్లె ప్రగతి కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామపంచాయతీకి డాక్టర్ పల్లె ప్రకృతి వనాలు నర్సరీలు వైకుంఠధామాలు ఏర్పాటు చేసి పారిశుద్ధ్యనికి పెద్దపీట వేశారని తెలిపారు అయితే ప్రస్తుత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వాటా నిధులు రూపాయి కూడా విడుదల చేయకపోవడంతో పల్లె ప్రకృతి వనాలు ఎండిపోయి పారిశుద్ధ్య పరిస్థితి దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు గతంలో నాటిన 250 కోట్ల మొక్కలను సంరక్షించాల్సినది పోయి అభివృద్ధి పనుల పేరిట చెట్లను విచక్షణ రహిత్యంగా నరికి వేస్తున్నారని ఎమ్మెల్యే ఆరోపించారు తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి గ్రామపంచాయతీలకు నిధులు విడుదల చేసి పల్లె అభివృద్ధిని కాపాడాలని డిమాండ్ చేశారు ప్రభుత్వం తన బాధ్యతను విస్మరించినప్పటికీ ప్రజల ఆరోగ్యం పరిశుభ్రమైన వాతావరణం కోసం బీఆర్ఎస్ ముందుండి పోరాడుతుందని ఎమ్మెల్యే సంజయ్ తెలిపారు ఈ కార్యక్రమంలో భారత రాష్ట్ర సమితి పార్టీ కోరుట్ల మండల అధ్యక్షులు దారిశెట్టి రాజేష్







సర్పంచులు నత్తి రాజ్ కుమార్ నాయకులు దీకొండ రాజనర్సయ్య పిడుగు సందయ్య గడి కొప్పుల గోపాల్ గట్ల అనంతస్వామి బోడ గంగాధర్ తుక్కారెడ్డి నరేందర్ రెడ్డి కాశిరెడ్డి మోహన్ రెడ్డి దుంపల రాజనర్సయ్య గ్రామ యువత మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వై అనూప్ రావు జన్మదిన వేడుకలు

**కోరుట్ల సెప్టెంబర్ 06 (వుదయం ప్రతినిధి)**



కోరుట్ల పట్టణంలోని అనూప్ రావు నివాసంలో భారతీయ జనతా పార్టీ కోరుట్ల నియోజకవర్గ నాయకుల ఆధ్వర్యంలో కోరుట్ల నియోజకవర్గ బిజెపి ఇంచార్జ్ డాక్టర్ అనూప్ రావు జన్మదిన వేడుకలు నిర్వహించారు ఇట్టి కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షులు రాచకొండ యాదగిరి బాబు జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి శ్రీనివాస్ రాష్ట్ర నాయకులు రుద్ర శ్రీనివాస్ కోరుట్ల పట్టణ అధ్యక్షులు కస్తూరి లక్ష్మీనారాయణ మెట్పల్లి పట్టణ అధ్యక్షులు దొనికెల నవీన్ జిల్లా ఉపాధ్యక్షులు తుకారాం గౌడ్ జిల్లా కార్యదర్శి సుదవేణి మహేష్ కోరుట్ల కౌన్సిలర్లు మెట్పల్లి కౌన్సిలర్లు కోరుట్ల మండల అధ్యక్షులు పంచరి విజయ్ కుమార్ మల్లాపూర్ మండల అధ్యక్షులు గోపిడి శ్రీనివాస్ పైడిమడుగు సర్పంచ్ బడుగు భూమేష్ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు జోగిన్ పెల్లి సర్పంచ్ తిరుపతి రెడ్డి మల్లాపూర్ మండల అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి ఇబ్రహీం పట్నం సురేష్ బీజేవైఎం జిల్లా అధ్యక్షులు శేఖర్ రెడ్డి కోరుట్ల మెట్పల్లి పట్టణ భారతీయ జనతా పార్టీ వివిధ హోదాల నాయకులు కార్యకర్తలు నియోజకవర్గ స్థాయి నాయకులు కోరుట్ల పట్టణ యువ మోర్చా అధ్యక్షులు దమ్మ సంతోష్ రెడ్డి బీజేవైం నాయకులు కోరుట్ల పట్టణ ఐఎంఏ వైద్యులు వ్యాపారస్తులు ఆర్ఎంపి డాక్టర్లు వివిధ కుల సంఘాల నాయకులు అందరు కూడా విచ్చేసి అనూప్ రావు ను శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు ముందుగా కోరుట్ల పట్టణంలోని వేములవాడ రోడ్డులో ఉన్న హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ధర్మపురి అరవింద్ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ప్రజాసేవలో మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని ఆకాంక్షించారు అనంతరం గడి స్కూల్ లో విద్యార్థుల సమక్షంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో బీజేపీ బీజేవైఎం దళిత మోర్చా కిషన్ మోర్చా నాయకులు కార్యకర్తలు అభిమానులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఆదివారం కూడా ఆగని ఎస్ఐఆర్ సర్వే

**ముత్తారం సెప్టెంబర్ 06(వుదయం ప్రతినిధి):**



ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) సర్వే ప్రక్రియను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలనే లక్ష్యంతో రెవెన్యూ అధికారులు సెలవు రోజునూ క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించారు.ముత్తారం మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం కూడా సర్వే పనులు కొనసాగించడంతో అధికారులు, సిబ్బంది అంకిత భావం ప్రదర్శించారు.ఇంటింటికీ వెళ్లి ఓటరు వివరాలను పరిశీలిస్తూ, అవసరమైన సమాచారాన్ని సేకరించి నమోదు చేశారు.సర్వే ప్రక్రియను వేగవంతం చేస్తూ ఎలాంటి లోపాలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. గడువే లక్ష్యంగా అధికారులు,సిబ్బంది సెలవును సైతం పక్కనబెట్టి విధుల్లో నిమగ్నమయ్యారు.ఈ కార్యక్రమంలో రెవిన్యూ ఇన్స్పెక్టర్లు,జీపీవో,రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొని సర్వే పనులను పర్యవేక్షించారు. మండలంలో ఎస్ఐఆర్ సర్వేను విజయవంతంగా పూర్తి చేసేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

# అధిక లోడ్‌తో మట్టి తరలింపు

- ఓడేడే–గోదావరిఖని రహదారిపై భారీ ఒత్తిడి
- భయాందోళనలో హరిపురం, కేశన్‌పల్లి, మచ్చుపేట ప్రజలు

**ముత్తారం సెప్టెంబర్ 06(వుదయం ప్రతినిధి):**



రామగిరి మండలం నుంచి ముత్తారం మండలంలో నిర్మిస్తున్న జాతీయ రహదారి పనుల కోసం భారీ టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తుండటంతో ఓడేడే–గోదావరిఖని ప్రధాన రహదారి తీవ్రంగా దెబ్బతింటోంది.నిబంధనలకు విరుద్ధంగా అధిక లోడ్‌తో టిప్పర్లు నిరంతరం రాకపోకలు సాగిస్తుండటంతో రహదారి పలు చోట్ల కుంగిపోవడంతో పాటు పగుళ్లు ఏర్పడుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.హరిపురం, కేశన్‌పల్లి,మచ్చుపేట గ్రామాల మీదుగా వెళ్లే ఈ ప్రధాన రహదారిపై రోజూ వందల సంఖ్యలో భారీ వాహనాలు సంచరిస్తున్నాయి. అధిక బరువుతో ప్రయాణిస్తున్న టిప్పర్ల వల్ల రహదారిపై దుమ్ము ధూళి ఎగిసిపడుతుండటంతో పాటు వాహనాల వేగం కారణంగా గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ద్విచక్రవాహనదారులు, వృద్ధులు భయభ్రాంతులకు గురవుతున్నారు.గ్రామాల మధ్యనున్న మలుపులు, ఇరుకైన ప్రాంతాల్లో భారీ టిప్పర్లు వేగంగా ప్రయాణిస్తుండటంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనన్న ఆందోళన నెలకొంది.ఇప్పటికే రహదారి అంచులు దెబ్బతినడంతో పాటు కొన్ని ప్రాంతాల్లో గుంతలు ఏర్పడి ప్రయాణికులకు ఇబ్బందిగా మారిందని స్థానికులు చెబుతున్నారు.జాతీయ రహదారి నిర్మాణం అభివృద్ధికి అవసరమే అయినప్పటికీ,నిబంధనలకు అనుగుణంగా లోడ్ పరిమితులను పాటించాలని, రహదారి సంరక్షణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.అధిక లోడ్‌తో మట్టి తరలిస్తున్న వాహనాలపై రవాణా, గనుల శాఖ అధికారులు ప్రత్యేక నిఘా పెట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.అదేవిధంగా గ్రామాల గుండా వెళ్లే టిప్పర్ల వేగాన్ని నియంత్రించేందుకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన చోట్ల స్పీడ్ బ్రేకర్లు నిర్మించాలని, రహదారిపై నీటి చల్లింపు చేపట్టి దుమ్ము సమస్యను తగ్గించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. సమస్య మరింత తీవ్రరూపం దాల్చకముందే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# జీనియస్ చెస్ అకాడమీ ప్రారంభం

**జగిత్యాల సెప్టెంబర్ 06 (వుదయం ప్రతినిధి)**



జగిత్యాల పట్టణ సాయిబాబా గుడి ఎదురుగా డాక్టర్ నవీన్ అనూప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జీనియస్ చెస్ అకాడమీని జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ యం సంజయ్ కుమార్ ప్రారంభించగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గాజంగి నందయ్య పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఏకాగ్రత ఆలోచనా శక్తి నిర్ణయ సామర్థ్యాన్ని పెంపొందించడంలో చెస్ ఎంతో ఉపయోగకరమన్నారు చిన్న వయసు నుంచే విద్యార్థులను చెస్ వంటి మేధో క్రీడల వైపు ప్రోత్సహించాలని సూచించారు జీనియస్ చెస్ అకాడమీ ద్వారా విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ అందించి రాష్ట్ర జాతీయ స్థాయిలో రాణించేలా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు అనంతరం మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ మాట్లాడుతూ జగిత్యాల పట్టణంలో చెస్ అకాడమీ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు చెస్ కేవలం ఒక క్రీడ మాత్రమే కాకుండా విద్యార్థుల్లో ఏకాగ్రత సహనం తార్కిక ఆలోచన సమస్యలను పరిష్కరించే సామర్థ్యాన్ని పెంపొందిస్తుందని తెలిపారు తల్లిదండ్రులు తమ పిల్లలను చదువుతో పాటు క్రీడల్లో కూడా ప్రోత్సహించాలని సూచించారు జీనియస్ చెస్ అకాడమీని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో జిల్లా నుంచి రాష్ట్ర జాతీయ స్థాయి చెస్ క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు జీనియస్ చెస్ అకాడమీతో విద్యార్థులకు మెరుగైన అవకాశాలు ఉన్నాయన్నారు ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి బండ శంకర్ కౌన్సిలర్లు వేముల శ్రీనివాస్ డీసీసీ ఉపాధ్యక్షులు అనిల్ పంబాల రాము శరత్ రావు తో పాటు పలువురు నాయకులు కార్యకర్తలు చెస్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు



# 'వెలుగుల దాత' పూదరి దత్తాగౌడ్ కు ఘన సత్కారం

**పెద్దపల్లి, సెప్టెంబర్ 06 (వుదయం ప్రతినిధి)**

మానవత్వమే పరమావధిగా,పేద ప్రజల కళ్లల్లో ఆనంద వెలుగులు నింపడమే ధ్యేయంగా అహర్నిశలు శ్రమిస్తున్న ప్రముఖ సామాజిక వేత్త, లయన్స్ క్లబ్ విజన్ కేర్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఐ క్యాంప్స్ డిస్ట్రిక్ట్ కమిటీ చైర్మన్ పూదరి దత్తాగౌడ్ ను అత్యుత్తమ పురస్కారం వరించింది.ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేలాది మంది పేదలకు ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తూ చూపు నిచ్చిన ఆయన అసమాన సామాజిక సేవలను గుర్తించి, లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320G ఆయనకు ప్రతిష్టాత్మకమైన 'ఉత్తమ ఐ క్యాంప్స్ డిస్ట్రిక్ట్ కమిటీ చైర్మన్' అవార్డును ప్రకటించింది.ఆదివారం రామగుండంలోని ఆర్.ఆర్ గార్డెన్స్‌లో అత్యంత వైభవంగా నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించి,అవార్డును అందజేశారు. ఈ వేడుకలో లయన్స్ ప్రముఖులు సింహారాజు కోదండరాములు,దీపక్ భట్టాచార్య,మోర భద్రేశం,ఊదరి చంద్రమోహన్,కట్కూరి సత్యనారాయణ,బుద్ధార్తి సతీష్ కుమార్,వంగల రవీందర్ తదితరులు పాల్గొని దత్తాగౌడ్‌కు హృదయపూర్వక సేవాభినందనలు తెలియజేశారు.



# బోర్ ఏర్పాటుకు రూ.20 వేల విరాళం

**ముత్తారం సెప్టెంబర్ 06(వుదయం ప్రతినిధి):**

శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయ అభివృద్ధికి అడవిశ్రీరాంపూర్ మాజీ సర్పంచ్ బర్ల రాధా చంద్రమౌళి మరోసారి తన సేవాభావాన్ని చాటుకున్నారు. కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తులకు మెరుగైన నీటి సౌకర్యం కల్పించే లక్ష్యంతో బోర్ ఏర్పాటు కోసం రూ.20,000 నగదు విరాళాన్ని అందజేశారు.ఆయన అందించిన సహాయం ఆలయ అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు.సామాజిక సేవా కార్యక్రమాల్లో ఎల్లప్పుడూ ముందుండే బర్ల రాధా చంద్రమౌళి ఆలయానికి అందించిన విరాళంపై కమిటీ సభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.



# కౌన్సిలింగ్ తో వృద్ధుల కేసులు పరిష్కారం

**జగిత్యాల సెప్టెంబర్ 06 (వుదయం ప్రతినిధి)**

జిల్లా లోని జగిత్యాల మెట్ పల్లి కోరుట్ల డివిజన్ల మండలాలకు చెందిన నిరాధరణకు గురవుతున్న వృద్ధ తల్లిదండ్రుల ఫిర్యాదుల వారి కొడుకులు కూతుర్లు కోడళ్ళను ఆదివారం పిలిపించి తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో అసోసియేషన్ ప్రతినిధులు వృద్ధుల చట్టం వివరిస్తూ కౌన్సిలింగ్ చేయడంతో వారు స్పందించి తమ తల్లిదండ్రులను పోషణ రక్షణ బాగోగులు మా భాద్యతేనని అఫిడవిట్స్ సమర్పించి వెంట తీసుకెళ్లారు తమ సమస్యలు పరిష్కరించిన హరి అశోక్ కుమార్ కు ఆ వృద్ధ తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు ఈ కౌన్సిలింగ్ లో సీనియర్ సిటిజన్స్ ప్రతినిధులు పిసీ హన్మంత్ రెడ్డి పూసాల అశోక్ రావు గౌరిశెట్టి విశ్వనాథం వెల్ముల ప్రకాష్ రావు బొల్లం విజయ్ కరుణ విజయలక్ష్మిలు పాల్గొన్నారు.

# దళిత విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడొద్దు



- బెస్ట్ అవైలబుల్ స్కూల్ ఫీజు బకాయిలు తక్షణమే చెల్లించాలి
- ఫీజులు చెల్లించకుంటే 'చలో కలెక్టరేట్, చలో ప్రజాభవన్'

**పెద్దపల్లి,సెప్టెంబర్ 06 (వుదయం ప్రతినిధి)**

రాష్ట్రంలో ఎస్సీ,ఎస్టీ విద్యార్థుల అభ్యున్నతి కోసం అమలు చేస్తున్న బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీమ్ ఫీజు బకాయిలను ప్రభుత్వం తక్షణమే చెల్లించి,నిరుపేద దళిత విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు మామిడిపల్లి బాపయ్య,జిల్లా ఉపాధ్యక్షులు,సుద్దల మాజీ ఎంపీటీసీ సంకనపల్లి లక్ష్మయ్య,ఆదిజంబవ అరుంధతీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోటగిరి పాపయ్య డిమాండ్ చేశారు. ఆదివారం పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో దివంగత మర్రి చెన్నారెడ్డి హయాంలో ప్రారంభమైన ఈ పథకం ద్వారా ఎంతోమంది దళిత విద్యార్థులు కార్పొరేట్ స్థాయి విద్యనభ్యసించి ఐఏఎస్,ఐపీఎస్, ఇంజనీర్లుగా ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని గుర్తుచేశారు.ఈ పథకం కింద డే స్కాలర్ విద్యార్థులకు ఏటా రూ,28 వేలు,5వ తరగతి నుండి 10వ తరగతి వరకు విద్యార్థులకు విద్య,హాస్టల్ సదుపాయాలతో కలిపి రూ.48 వేల చొప్పున ప్రభుత్వం చెల్లించాల్సి ఉందన్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వంతో పాటు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోనూ సంవత్సరాలుగా ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు.ప్రభుత్వం నుండి బిల్లులు రాకపోవడంతో ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు దళిత పిల్లలకు పుస్తకాలు, డ్రెస్సులు,బోధనా మెటీరియల్ ఇవ్వడం లేదని,కొన్నిచోట్ల తరగతుల నుండి బయటకు పంపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.తీవ్ర మనస్తాపానికి గురైన ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు ఇకపై తమ వల్ల కాదంటూ విద్యార్థులను పంపవద్దని జిల్లా కలెక్టర్‌తో పాటు ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు సమర్పించే దుస్థితి దాపురించిందని ధ్వజమెత్తారు.బడ్జెట్‌లో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించామని చెప్తున్న ప్రభుత్వం,ఎస్సీ సంక్షేమ శాఖకు చెందిన నిధుల నుండి బెస్ట్ అవైలబుల్ పథకానికి తక్షణమే బకాయిలు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.రాష్ట్ర ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి అసెంబ్లీ వేదికగా లేదా ప్రత్యేక బడ్జెట్ ద్వారా ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. రాబోయే 15 రోజుల్లోగా ఫీజు బకాయిలు చెల్లించకపోతే ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం,ఆదిజంబవ,అరుంధతీ సంఘాలు, దళిత ఐక్య వేదికల ఆధ్వర్యంలో దశలవారీగా పోరాటాలు చేపడతామని హెచ్చరించారు.మొదటి విడతగా చలో కలెక్టరేట్ ఆ తర్వాత చలో ధర్మపురి అనంతరం చలో ప్రజాభవన్ కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు.

# పట్ట పగలే వెలుగుతున్న వీధి దీపం

**ట్రాన్స్‌ఫార్మర్ ఉన్న స్తంభానికే ఏర్పాటు.. పట్టించుకోని అధికారులు**

**ముత్తారం సెప్టెంబర్ 06(వుదయం ప్రతినిధి):**



ముత్తారంమండలంలోని కేశన్‌పల్లి గ్రామంలో విద్యుత్ దీపాల నిర్వహణపై అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది.గ్రామంలో ఓ వీధిదీపం రాత్రి, పగలు అనే తేడా లేకుండా నిరంతరం వెలుగుతుండటంతో విద్యుత్ వృథా అవుతోంది.అదీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభానికే వీధిదీపం ఉండటంతో పగటిపూట కూడా దీపం వెలుగుతున్న దృశ్యం స్థానికులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది.విద్యుత్ వృథాను అరికట్టాల్సిన అధికారులు ఈ విషయాన్ని పట్టించుకోకపోవడంపై గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.ప్రజాధనం,విద్యుత్ వృథా కాకుండా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పగటిపూట వెలుగుతున్న వీధిదీపాన్ని పరిశీలించి, లోపాన్ని సరిచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# దశమి పల్లకి సేవ స్వామి వారికి పంచామృత అభిషేకం

**ముడుపు సమర్పణ ఉచిత అమృత నిర్గుండి కశాయం వితరణ...**

**జగిత్యాల సెప్టెంబర్ 06 (వుదయం ప్రతినిధి)**



భానువాసరే శ్రావణ మాసం శుక్ల పక్షం దశమి పర్వదినం సందర్భంగా శ్రీ సూర్య ధన్వంతరి ఉషా చాయ సమేత శ్రీ సూర్య నారాయణ స్వామి వారికి పంచామృత అభిషేకం నిర్వహించారు ఆదివారం సూర్య భగవానుని విశిష్ట ప్రత్యేక దినం అందువల్ల ఆదివారం హిందూ సాంప్రదాయంలో సూర్య భగవానుని (సూర్యుని)కి అంకితమైన పవిత్ర మైన రోజు అని ఈ రోజు సూర్యదేవుని ఆరాధించడం వల్ల ఆరోగ్యం ఆయుష్మానుభవం విజయం ధనం ప్రసిద్ధి లభిస్తాయని విశ్వాసం ఉంది తదియ పర్వదినం పురస్కరించుకొని శ్రీ సూర్య ధన్వంతరి దేవాలయములో శ్రీ సూర్య భగవానుకి ప్రత్యేక పూజల అనంతరం ప్రత్యేక పల్లకి సేవ నిర్వహించి అమృత నిర్గుండి కశాయం ఉచిత వితరణ చేపట్టి సూర్య భగవాన్ కు భక్తులు ముడుపులు కట్టారు ఈ కార్యక్రమంలో ఫౌండర్ చైర్మెన్ డాక్టర్ వడ్లగట్ట రాజన్న వర్కింగ్ ప్రెసిడెంట్ వొద్నాల శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శి వడ్లగట్ట శంకర్ సహాయ కోశాధికారి గోపి స్వాతి ప్రధాన కార్యదర్శి వడ్లగట్ట శంకర్ భారతాల రాజసాగర్ వేముల రాజేష్ ప్రవీణ్ కుమార్ ప్రియదర్శిని లక్ష్మి నారాయణ రేగొండ జ్యోతి లక్ష్మి నారాయణ హరి కృష్ణ శ్రీలక్ష్మి తా టిపల్లి ప్రవీణ్ కుమార్ చైతన్య దావదాస్ అర్చకులు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# కష్టాల్లో ఉన్న కుటుంబాలకు పుట్ట మధూకర్ పరామర్శ

**మంథని, సెప్టెంబర్ 6 (వుదయం ప్రతినిధి):**



మంథని నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను, అనారోగ్యంతో బాధపడుతున్న వారిని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆదివారం పరామర్శించారు. కాటారం మండలం బస్వాపూర్‌లో ఇటీవల మృతి చెందిన పెరుమాండ్ల పోచయ్య కుటుంబాన్ని, బొప్పారంలో మృతి చెందిన గడ్డం రాజమల్లు కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపారు. ఎర్రగుంటపల్లిలో బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి మానేం రాజాబాపు తండ్రి మల్లయ్య మృతిచెందడంతో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అలాగే చింతకాని గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న ఆతుకూరి సారయ్యను, దేవారంపల్లిలో పాడి సరోజనను కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కాటారంలో ప్రమాదంలో గాయపడిన బీఆర్ఎస్ నాయకుడు జాడి శ్రీశైలంను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు.

దేవారంపల్లిలో ఇటీవల మృతి చెందిన ఎండీ సైదా కుటుంబాన్ని కూడా పుట్ట మధూకర్ పరామర్శించి సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయా కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# ప్రపంచ శాంతి కోసం ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలి




**ఏఐపీఎస్ఓ రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కే వి ఎల్**

సూర్యాపేట, సెప్టెంబర్ 6: వుదయం ప్రతినిధి

ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న యుద్ధ వాతావరణం, హింస, సామ్రాజ్యవాద దురాక్రమణలకు వ్యతిరేకంగా ప్రజలంతా ఐక్యంగా నిలబడి శాంతి కోసం ఉద్యమించాలని అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (ఏఐపీఎస్ఓ) రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కె.వి.ఎల్ (ఏ వి ఎల్) పిలుపునిచ్చారు. సూర్యాపేటలోని ధర్మ భిక్షం భవనంలో నిర్వహించిన ఏఐపీఎస్ఓ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. యుద్ధాల వల్ల సాధారణ ప్రజలే తీవ్రంగా నష్టపోతున్నారని, ముఖ్యంగా మహిళలు, పిల్లలు, పేదలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయుధ పోటీకి, యుద్ధాలకు వెచ్చిస్తున్న భారీ నిధులను ప్రజల సంక్షేమం, విద్య, వైద్యం, ఉపాధి రంగాలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమం ఏఐపీఎస్ఓ జిల్లా అధ్యక్షు లు తోటి మురళి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి గౌరవ అధ్యక్షులు బొమ్మగాని శ్రీనివాస్, కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు అనంతుల మల్లేశ్వరి, సహాయ కార్యదర్శి సా.రెడ్డి వెంకట్ రెడ్డి, గాలి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నూతన ముత్యాలమ్మ గుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి

చిలుకూరు సెప్టెంబర్ 06:( ఉదయం )



మండలంలోని నారాయణపురం, పాలెఅన్నారం గ్రామంలోని నూతన శ్రీ ఇంద్రవెల్లి ముత్యాలమ్మ, పాలెఅన్నారం ముత్యాలమ్మ అమ్మవార్లను ఆదివారం ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అమ్మవారికి పూజలు నిర్వహించి గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యే పద్మావతిని శాలువాతో సన్మానించారు. ఈకార్యక్రమంలో, మండవ జయమ్మ వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు,గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సత్తుపల్లి ప్రగతి రథసారథి..!

**ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్!**

కల్లూరు,సెప్టెంబర్ 6(వుదయం ప్రతినిధి)



దశాబ్దాల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతూ.. సత్తుపల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతున్నారు ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్. రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్‌తో కలిసి బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలుస్తూ పాలనలో తనదైన ముద్ర వేస్తున్నారు. దశాబ్దాల కలకు సాకారం: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహకారంతో మూడు దశాబ్దాలుగా నలుగుతున్న 'కల్లూరు మున్సిపాలిటీ' సాధనలో ఎమ్మెల్యే రాగమయి కీలకపాత్ర పోషించారు. విద్యాభివృద్ధికి పెద్దపీట: కల్లూరు మండలం చెన్నూరులో రూ.250 కోట్లతో అత్యాధునిక ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులు ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో శరవేగంగా జరుగుతున్నాయి. పట్టణం, మారుమూల పల్లెల్లో పటిష్టమైన డ్రైనేజీ వ్యవస్థకు శ్రీకారం చుట్టారు.

మహిళలు,విద్యార్థులకు భరోసా: ఆశా ఫౌండేషన్ ద్వారా మహిళలకు వేలాది కుట్టు మిషన్లు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినులకు 5 వేలకు పైగా ఉచిత సైకిళ్లను పంపిణీ చేశారు. పేద విద్యార్థులకు ఆర్థిక సాయంతో పాటు వారిలో ఆత్మస్థైర్యం కల్పించేలా ప్రత్యేక సదస్సులు నిర్వహించారు. రైతన్నకు అండగా: రైతుల కోసం అధికారులతో కొట్లాడి సాగు నీరు, ధాన్యం ఆరబోతకు కల్లాలు మంజూరు చేయించారు. కోట్లాది రూపాయలతో వ్యవసాయ పొలాలకు సీసీ, బీటీ రోడ్లు వేశారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూవివాదాలను స్వయంగా చొరవ తీసుకుని పరిష్కరించారు. మౌలిక వసతుల కల్పన: నియోజకవర్గమంతటా నూతన ఆసుపత్రులు, అంగన్‌వాడీ కేంద్రాలు, కమ్యూనిటీ హాళ్లు, విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణంతో పల్లెలకు కొత్త శోభ తీసుకొచ్చారు.

సంక్షేమమే లక్ష్యంగా: సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కోటి పది లక్షల రేషన్ కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల మంజూరుతో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతిగా నిరూపించుకుంది. మట్టా దంపతుల నిరంతర కృషితో సత్తుపల్లిలో సామాన్యులకు కొండంత భరోసా దక్కుతుండటంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

## కష్టార్జితమంతా.. ఆరోగ్యాన్ని కొనుక్కోవడానికేనా?

**గుడ్ లైఫ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కోట పుల్లయ్య**

కల్లూరు సెప్టెంబర్ 6(వుదయం ప్రతినిధి):



ఒకప్పుడు ప్రకృతి ఆధారిత పద్ధతుల్లో పండించిన పంటలు, ఇంటి వంటకాలు, చిరుధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయలు, సీజనల్ పండ్లతో ప్రజల జీవనం ఆరోగ్యంగా ఉండేదని.. ప్రస్తుతం ఆధునిక జీవనశైలి, రసాయనాల వినియోగం, ప్రాసెస్డ్ ఫుడ్, శారీరక శ్రమ తగ్గిపోవడంతో ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని గుడ్ లైఫ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కోట పుల్లయ్య అన్నారు.

ప్రస్తుత పరిస్థితులపై ఆయన మాట్లాడుతూ.. మన పూర్వీకులు ఏం తిన్నారు? మనం ఏం తింటున్నాం? అనే విషయాన్ని ఒక్కసారి ఆలోచిస్తే మార్పెంటో అర్థమవుతుందన్నారు. వ్యవసాయం వ్యాపారంగా మారడంతో అధిక దిగుబడుల కోసం రసాయనాల వినియోగం పెరిగిందన్నారు. మరోవైపు ప్యాకేజ్డ్, ప్రాసెస్డ్ ఫుడ్, అధిక చక్కెర, ఉప్పు, కొవ్వు కలిగిన ఆహారంతో పాటు శారీరక శ్రమ తగ్గడం, నిద్రలేమి, ఒత్తిడి అనారోగ్యానికి కారణమవుతున్నాయని పేర్కొన్నారు.

**వ్యాధి తర్వాత పరుగులు ఎందుకు?**

ఆరోగ్యం దెబ్బతిన్న తర్వాత ఆసుపత్రుల చుట్టూ తిరగడం కంటే.. ముందుగానే జీవనశైలిని మార్చుకోవడం ముఖ్యమన్నారు. స్థానికంగా లభించే తాజా ఆహారం, ఇంటి వంట, నిత్య వ్యాయామం, తగినంత నిద్ర, మానసిక ప్రశాంతతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. "మనం నేలను కాపాడితే.. నేల మనల్ని కాపాడుతుంది. స్వచ్ఛమైన ఆహారం ఆరోగ్యానికి రక్షణ. ఆరోగ్యాన్ని ఆసుపత్రిలో మాత్రమే కాదు.. మన వంటగదిలో, మన రోజువారీ అలవాట్లలో కాపాడుకోవాలని అన్నారు.

ఆధునిక జీవనశైలిని పూర్తిగా వదిలేయడం సాధ్యం కాకపోయినా.. అందులో ఆరోగ్యకరమైన అలవాట్లను భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. డబ్బు పోతే తిరిగి సంపాదించుకోవచ్చు.. కానీ కోల్పోయిన ఆరోగ్యాన్ని పూర్తిగా తిరిగి పొందడం ఎల్లప్పుడూ సాధ్యం కాదు. అందుకే వ్యాధితో పోరాడే ముందు.. మన జీవనశైలితో పోరాడాలని అన్నారు. భవిష్యత్తులో ట్రస్ట్ చేపట్టే కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని కోరారు.

## జామియా మసీద్‌లో బహిరంగ సభ పోస్టల్ ఆవిష్కరణ



కల్లూరు,సెప్టెంబర్ 6 (ఉదయం ప్రతినిధి)

ముస్లింల ఐక్య సంఘం ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీన కొత్తగూడెం క్లబ్లో బస్టాండ్ ప్రక్కన మగ్రిబ్ సమాజ్ అనంతరం జిల్లా స్థాయి రెండవ గొప్ప బహిరంగ సభ జరగనున్నట్లు కల్లూరు మండల సదర్ ఎండి హనీఫ్ మసీదు కమిటీ సదర్ సయ్యద్ రావూఫ్ సయ్యద్ అలీ ఎస్ డి అమీరుద్దీన్ ఎస్కే సిరాజుద్దీన్లు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక జన్మదిన మసీదులో ఈ మేరకు ముస్లిం ఐక్య సంఘం ఆధ్వర్యంలో జరుగునున్న జిల్లా స్థాయి బహిరంగ స భను జయప్రదం చేయాలని పోస్టర్లు ఆవిష్కరించి వారు పిలుపునిచ్చారు మహమ్మద్ సందేశం అనే అంశంపై జరుగుతుందని ముఖ్య అతిథులుగా ఉత్తరప్రదేశ్ కు చెందిన ప్రముఖులు హజరత్ అబ్బాస్ మూలాన మహమ్మద్ సల్మాన్ జిజోర్ని నక్ష్ బందీ సాహెబ్ ఢిల్లీకి చెందిన డాక్టర్ హఫీస్ ఉర్ ఉర్ రెహమాన్ సాహెబ్ హిందూ ముస్లిం జన్ ఏక్ తా మంచ్ కాన్పూర్ కు చెందిన స్వామి లక్ష్మీ శంకరాచార్యులు హాజరుకానున్నట్లు వారు తెలిపారు హిందూ ముస్లిం క్రిస్టియన్ అన్ని సామాజిక వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు ఈ కార్యక్రమంలో ముస్లిం ప్రముఖులు షేక్ ముజాయిద్, ఎస్కే ఖలీద్ ,ఎస్ డీ బాబా,గౌస్ ,ఎస్కే ఇర్ఫాన్ ,ఎస్ డి జావిద్ ,తదితరులు పాల్గొన్నారు.

## పుష్కర భక్తులకు భద్రాచలంలో వసతి సౌకర్యం



**రూ.1.50 కోట్లతో డార్మెంటరీ నిర్మాణానికి భూమిపూజ**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సెప్టెంబర్ 06 (వుదయం ప్రతినిధి)

వచ్చే ఏడాది జూన్–జూలై నెలల్లో జరగనున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని భద్రాచలం వచ్చే భక్తులకు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించేందుకు డార్మెంటరీ భవనాన్ని నిర్మిస్తున్నట్లు భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు తెలిపారు. భద్రాచలంలోని అమ్మ సత్రం ప్రాంతంలో దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో రూ.1.50 కోట్ల వ్యయంతో నిర్మించనున్న జీ+1 డార్మెంటరీ భవనానికి ఆదివారం భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

గోదావరి పుష్కరాలకు గోదావరి పరివాహక ప్రాంతాలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారని ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యంగా దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున, వారికి కనీస వసతులు కల్పించేందుకు డార్మెంటరీ నిర్మాణానికి దేవాదాయ శాఖ నిధులు మంజూరు చేసిందన్నారు. పుష్కరాల ఏర్పాట్లపై ప్రతి పది రోజులకు ఒకసారి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఘాట్ నిర్మాణాలను ఇరిగేషన్ శాఖ, తాగునీటి సరఫరా పనులను ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ, రహదారి పనులను ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు చేపట్టి, పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.

**నాణ్యతతో పనులు వేగంగా పూర్తి చేయాలి: కలెక్టర్ అంకిత్**

జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ 12 ఏళ్లకు ఒకసారి వచ్చే గోదావరి పుష్కరాలను తెలంగాణ ప్రభుత్వం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపడుతోందన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తున్నట్లు తెలిపారు.

గోదావరి పరివాహక ప్రాంతాల్లో చేపట్టిన ఘాట్‌ల నిర్మాణంతో పాటు డార్మెంటరీ నిర్మాణాలను కూడా సకాలంలో, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని ఏడు జిల్లాల్లో గోదావరి పుష్కర పనులు కొనసాగుతున్నాయని, భద్రాచలంలో జరుగుతున్న పనులపై ప్రత్యేక దృష్టి సారించి వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఈఓ దామోదర్, సర్పంచ్ పూనం కృష్ణ, ఉప సర్పంచ్ రత్నం కవిత, వార్డు సభ్యులు రమణ, కారం దుర్గారావు, వాణి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ 1000 రోజుల పాలన అంతా మోసమే



**ముఖ్యమంత్రి తీరు మారకపోతే అడుగడుగునా అడ్డుకుంటాం!**

అనంతగిరి సెప్టెంబర్ 06 వుదయం

మండల పరిధిలోని త్రిపురవరం గ్రామంలో "పల్లెల విధ్వంసం – పడకేసిన పారిశుధ్యం" అనే అంశంపై గ్రామస్థాయిలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి కోదాడ మాజీ శాసనసభ్యులు శ్రీ బొల్లం మల్లయ్య యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణలో ఏదో ఉద్ధరిస్తామని చెప్పి మాయమాటలతో అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు ప్రజా సమస్యలను పూర్తిగా గాలికి వదిలేశారు. తన కుర్చీ కాపాడుకోవడానికి ఢిల్లీ పెద్దలకు మూటలు పంపుతున్నారే తప్ప, ప్రజల బాగోగులు పట్టించుకోవడం లేదనీ కేసీఆర్ ఇచ్చిన రూ.2,000 పెన్షన్ ను రూ.4,000 చేస్తామని, రైతులకు, కౌలు రైతులకు మూడు పంటలకు రూ.15,000 ఇస్తామని, ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి నేడు ఆ మాటలను అటకెక్కించారు. పరిపాలన చేతకాక, తన అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికి రేవంత్ రెడ్డి అవాకులు చవాకులు పేలుతున్నారు. రాష్ట్రాన్ని సాధించిన నాయకుడు కేసీఆర్ ని పట్టుకొని ఒక సైకోలా ఆయన వాడుతున్న భాషను ప్రజలు ఛీత్కరించుకుంటున్నారు. ఆడా, మగా, పెద్దలు అనే విచక్షణ లేకుండా ముఖ్యమంత్రి మాట్లాడుతున్న తీరు దుర్మార్గం."రేవంత్ రెడ్డికి ఏమాత్రం మానవత్వం ఉన్నా, నోరు అదుపులో పెట్టుకుని పరిపాలనపై దృష్టి సారించాలి. ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలి. గ్రామాల్లో పారిశుధ్య కార్మికులకు వెంటనే వేతనాలు చెల్లించి, పల్లెల అభివృద్ధిపై దృష్టి పెట్టాలి. లేనిపక్షంలో, బీఆర్ఎస్ పార్టీ ఊరుకోదు. ప్రభుత్వ దౌర్జన్యాలను ప్రతిఘటిస్తాం, అడుగడుగునా ఈ ప్రభుత్వాన్ని స్తంభింపజేస్తాం" అని శ్రీ బొల్లం మల్లయ్య యాదవ్ ప్రభుత్వాన్ని తీవ్రంగా హెచ్చరించారు.

## గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధికి దాతల సహకారం అభినందనీయం



చర్ల, సెప్టెంబర్ 6: (వుదయం ప్రతినిధి)

గిరిజన గ్రామాల్లో చదువులకు దూరమవుతున్న గిరిజన విద్యార్థులకు విద్యను అందించడం ద్వారా వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ప్రముఖ వ్యాపారి ఎడారి గణపతి పిలుపునిచ్చారు. తన కుమార్తె దివంగత ఎడారి వెంకట కావ్య జ్ఞాపకార్థం చర్లలోని కొమరం భీం విద్యార్థి నిలయానికి 75 కేజీల బియ్యం అందించడంతో పాటు విద్యార్థులకు ఒకపూట భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కొమరం భీం విద్యార్థి నిలయ కార్యదర్శి జవ్వాది మురళీ కృష్ణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో గణపతి మాట్లాడుతూ.. గిరిజనుల వికాసం కోసం వనవాసీ సంస్థను ఏర్పాటు చేసి విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు ఉత్తమ ప్రవర్తనతో ఉన్నతులుగా ఎదిగి, సంస్థ పేరు ప్రతిష్టలను మరింత ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు. పేద విద్యార్థుల చదువుల్లో తాను కూడా భాగస్వామి కావడం సంతోషంగా ఉందన్నారు. తనలాంటి దాతలు మరింత మంది ముందుకు వచ్చి విద్యార్థులకు అండగా నిలిచి వారి జీవితాల్లో వెలుగులు నింపాలని కోరారు. వనవాసీ ప్రాంత మహిళా సహ ప్రముఖ్ పెద్దాడ ఆశాలత మాట్లాడుతూ.. వనవాసీ సంస్థ ఆధ్వర్యంలో గిరిజనులకు విద్య, వైద్య సౌకర్యాలను అందిస్తున్నట్లు తెలిపారు. మారుమూల గిరిజన గ్రామాలకు చెందిన ఆదివాసీ విద్యార్థులను అక్కున చేర్చుకొని విద్యతో పాటు సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలను అందిస్తున్నట్లు వివరించారు. కొమరం భీం విద్యార్థుల ప్రతిభా పాటవాలకు ఆకర్షితులై అనేక మంది దాతలు సహకారం అందించేందుకు ముందుకు రావడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో ఎడారి లక్ష్మణ్‌రావు, వనవాసీ జిల్లా కార్యదర్శి కోరం సూర్యనారాయణ, కొమరం భీం విద్యార్థి నిలయ అధ్యక్షుడు తాటి పాపారావు, ఉపాధ్యక్షులు గోగికార్ రాంలక్ష్మణ్, సహ కోశాధికారి వేములపల్లి ప్రవీణ్‌బాబు, కమిటీ సభ్యురాలు పోలిన రమాదేవి, నిలయ ప్రముఖులు వరలక్ష్మి , సంతోష్, సహ నిలయ ప్రముఖ్ ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ముత్యాలమ్మ, బోనాల పండుగ



చిలుకూరు, సెప్టెంబర్ 06: ( వుదయం )

మండల లోని జగ్జీవన్ రామ్ నగర్ కాలనీ లో ఆదివారం ముత్యాలమ్మ బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. సత్తెమ్మ గుడి దగ్గర నుండి మహిళలు బోనాలతో ఊరేగింపుగా గుడి దగ్గరకు వెళ్లి భక్తిశ్రద్ధలతో అమ్మవారికి మహిళలు బోనాలను సమర్పించారు. అనంతరం వారు అమ్మవారికి మొక్కులు తీర్చుకొని, గ్రామం సుభిక్షంగా ఉండాలని వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని అమ్మవారి అనుగ్రహం గ్రామ ప్రజలపై ఉండాలని కోరారు.

## నన్నయ జాతీయ పురస్కారం అందుకున్న పోతుగంటి వీరాచారి

సూర్యాపేట / నెల్లూరు, సెప్టెంబర్ 6:(వుదయం ప్రతినిధి)



ఆంధ్రప్రదేశ్ శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని దేవిశెట్టి స్వాములు రాజేశ్వరి (డి.ఎస్.ఆర్) కళ్యాణ మండపంలో ఆదివారం ఉదయం ఎం.వి. ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి మరియు గిడుగు రామ్మూర్తి జయంతిని పురస్కరించుకొని జాతీయ స్థాయి పురస్కారాల ప్రధానోత్సవం ఘనంగా జరిగింది. ఈ వేడుకలో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన జాతీయ స్థాయిలో ఉత్తమ కవులు, రచయితలు మరియు సాహితీవేత్తలు, ఉపాధ్యాయులను గుర్తించి ఒకే వేదికపై జాతీయ పురస్కారాలను ఎం.వి. ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు లీలా కృష్ణ మోహన్, సంస్థ ప్రధాన కార్యదర్శి ఎం. విజయలక్ష్మి చేతుల మీదుగా అందజేశారు. మన సూర్యాపేట పట్టణ వాసి, ప్రముఖ కవి, రచయిత, సామాజిక కార్యకర్త పోతుగంటి వీరాచారి ఈ ప్రతిష్టాత్మక ఆదికవి నన్నయ జాతీయ ప్రతిభా పురస్కారానికి ఎంపికవడం గర్వించదగ్గ విషయం. ఈ సందర్భంగా ఎం.వి. ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ముప్పవరపు లీలా కృష్ణమోహన్ మాట్లాడుతూ – ఈ సమాజంలో సాహిత్యానికి ప్రాధాన్యత తగ్గుతున్న కాలంలోనూ అక్షరాన్ని ఆయుధంగా చేసుకొని తెలుగు సాహిత్య రంగంలో సృజనాత్మకతను వెలిగిస్తూ, తన ఆలోచనలకు అక్షర రూపం ఇస్తూ సామాజిక చైతన్యానికి, తెలుగు భాష, తెలుగు వైభవం, తెలుగు సంస్కృతి సాంప్రదాయాల అభివృద్ధికి వీరాచారి చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. అందుకే ఆయనను ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు తెలిపారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి 250 మందికి పైగా కవులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారని తెలిపారు. అనంతరం ఎం.వి. ఫౌండేషన్ చైర్మన్, కార్యదర్శులు, సాదనాల వెంకటస్వామి నాయుడు చేతుల మీదుగా పోతుగంటి వీరాచారికి ఆదికవి నన్నయ జాతీయ ప్రతిభా పురస్కారాన్ని గౌరవప్రదంగా ప్రదానం చేస్తూ, జ్ఞాపిక, శాలువా, పూలదండతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు సాహితీవేత్తలు, కవులు, కళాకారులు వీరాచారికి అభినందనలు తెలియజేశారు.

## చెత్త కుప్పల మధ్య గ్రామం.. కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ నిరసన

**చెత్త సేకరణ, డ్రైనేజీల నిర్వహణపై ప్రభుత్వాన్ని నిలదీసిన బీఆర్ఎస్ నాయకులు**

మునగాల , సెప్టెంబర్ 06 (వుదయం):



కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయిన సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ రాష్ట్రవ్యాప్త నిరసనల్లో భాగంగా ఆదివారం జగన్నాథపురం గ్రామంలో పారిశుధ్య సమస్యలపై బీఆర్ఎస్ గ్రామ శాఖ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ నిర్లక్ష్యానికి గురైందని విమర్శించారు. గ్రామంలో క్రమం తప్పకుండా చెత్త సేకరణ జరగకపోవడంతో పలు ప్రాంతాల్లో చెత్తాచెదారం పేరుకుపోతుందని, డ్రైనేజీలు, వీధుల పరిశుభ్రతపై తగిన చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. గ్రామ ప్రజల సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పార్టీ నిరంతరం ప్రజల పక్షాన నిలబడి పోరాటాలు కొనసాగిస్తుందని నాయకులు స్పష్టం చేశారు.

ఈ నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు బెల్లంకొండ ఉపేందర్, మాజీ సర్పంచ్ వెంపటి భీష్మరావు, ఉప సర్పంచ్ మధనాల మల్లికార్జున్, 10వ వార్డు సభ్యులు దైద సైదులు, 1వ వార్డు సభ్యులు చీమ ముత్యాలు, బొల్లం సత్యనారాయణ, కాగితాల సైదులు, అమరగాని వీరబాబు, షేక్ లతీఫ్, షేక్ హుస్సేన్, షేక్ మొగల్ సాహెబ్, వెంపటి వెంకన్న, బడేటి లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర ఫలాలు బిసి, ఎస్సీ,ఎస్టీల దరి చేరడం లేదు

**బీసీ నేత ధనుంజయ నాయుడు ఆవేదన**

అనంతగిరి సెప్టెంబర్ 06 వుదయం



స్వాతంత్ర వచ్చి ఎనిమిది దశాబ్దాలు కావస్తున్న నేటికీ స్వాతంత్ర ఫలాలు బీసీ, ఎస్సీ,ఎస్టీల దరి చేరడం లేదని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు . ఆదివారం మండల కేంద్రంలో బీసీ ముఖ్య నాయకులతో కలిసి పాత్రికేయులతో మాట్లాడుతూ.. ఒకపక్క దేశం వేగంగా అభివృద్ధి చెందుతుందని పాలకులు ఎన్ని కల్ల బొల్లి మాటలు చెప్పినా ఈనాటికి రేషన్ బియ్యం కోసం జనం క్యూలో నిలబడుతున్నారని సరైన వైద్యం అందక అనేకమంది హతాన్మరణం చెందుతున్నారని నాణ్యమైన విద్య అందక పోటీ పరీక్షల్లో బీసీ ఎస్సీ ఎస్టీ వర్గాలు వెనుకబడిపోతున్నారని న్యాయ వ్యవస్థ కూడా పేదవాడికి అందుబాటులో లేకుండా పోయిందని అందు కొరకు ప్రభుత్వాలు ఏవైనా సరే ఉచిత విద్య, ఉచిత వైద్యం, ఉచిత న్యాయం అందించాలని అప్పుడే స్వాతంత్ర పాలు అందరికీ అందినట్లు అవుతుందని అభిప్రాయపడ్డారు. ఆయన వెంట బీసీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బొడ్డుపల్లి సుందరయ్య బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇనుగుర్తి వెంకట రమణాచారి కోదాడ నియోజకవర్గ అధ్యక్షుడు నిగిడాల వీరయ్య మహిళా విభాగం జిల్లా నాయకురాలు బచ్చు రాజ్యం, నియోజక వర్గ అధ్యక్షురాలు మండవ నాగమణి ఉన్నారు

## అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రి



మునగాల, సెప్టెంబర్ 06 (వుదయం):

మునగాల మండలంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదివారం పరిశీలించారు. ఆకుపాముల గ్రామంలో రూ.10 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఎన్‌ఏసీ భవన నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి, సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లతో పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కృష్ణానగర్ సమీపంలో రూ.28 కోట్లతో చేపడుతున్న ఆర్–9 ఎత్తిపోతల పథకం పైప్‌లైన్ విస్తరణ పనులను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పరిశీలించారు. పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుని, రైతులకు సాగునీరు అందించే విషయంలో ప్రాజెక్టు ప్రాధాన్యతను వివరించారు. పనులను వేగవంతం చేసి రైతులకు ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్, ఎస్పీ నర్సింహా, సీఈ నాగభూషణం, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజ్ఞ వికాస్‌లో చిన్నారుల ప్రతిభా ప్రదర్శన

సారపాక, 5/9/26 వుదయం ప్రతినిధి



జై వాసవి జై జై వాసవి... భద్రాచల వికాస తరంగిణి వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజ్ఞ వికాస్ కార్యక్రమంలో భాగంగా చిన్నారులలో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక భావనలు పెంపొందించే లక్ష్యంతో శ్రీకృష్ణాష్టకం నేర్పించి ప్రత్యేక పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో చిన్నారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు ప్రోత్సాహక బహుమతులను సారపాక వాసవి గ్రేటర్ క్లబ్ మరియు వనిత క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెస్సార్ స్కూల్ ప్రిన్సిపల్ సార్ వారి సతీమణిని ఘనంగా సన్మానించారు. అదే విధంగా పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరికీ వారి సేవలను గుర్తిస్తూ ప్రేమాభిమానాలకు గుర్తుగా చిరు కానుకలను అందజేశారు. విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని, ఉపాధ్యాయుడు కేవలం పాఠాలు చెప్పే వ్యక్తి మాత్రమే కాకుండా విద్యార్థులలోని ప్రతిభను గుర్తించి వారి భవిష్యత్తుకు సరైన మార్గాన్ని చూపించే మార్గదర్శి అని ఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భద్రాచల జీయర్ మఠం అధ్యక్షులు శ్రీ గట్టు వెంకటాచార్యులు గారు విచ్చేసి కార్యక్రమాన్ని మరింత వైభవంగా తీర్చిదిద్దారు. కార్యక్రమంలో వాసవి గ్రేటర్ క్లబ్ అధ్యక్షులు రేపాక సూర్యప్రకాష్ రావు గారు, బచ్చు సతీష్, కంచర్ల గౌతం, వనిత క్లబ్ అధ్యక్షురాలు కొంజెర్ల నిరోషా, పాలవాయి పావని, గుడిమెట్ల అనూష పాల్గొన్నారు. అలాగే వాసవియన్ కే.సి.ఎఫ్ జోన్ చైర్‌పర్సన్ భూమా చంద్రశేఖర రావు గారు, సారపాక గ్రేటర్ క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ పచ్చిపులుసు సుబ్బారావు గారు, వనిత క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ పచ్చిపులుసు లలిత కుమారి గారు, రేపాక రాజ్యలక్ష్మి , పచ్చిపులుసు లక్ష్మీతేజ, రాయపూడి శ్రియతో పాటు పలువురు వాసవి కుటుంబ సభ్యులు, మహిళలు, విద్యార్థులు మరియు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. శ్రీకృష్ణాష్టకం పోటీలు, చిన్నారులకు బహుమతుల ప్రదానం, టీచర్స్ డే సందర్భంగా ఉపాధ్యాయుల సన్మానం వంటి కార్యక్రమాలతో సారపాకలో జరిగిన ఈ వేడుక ఆధ్యాత్మికత, విద్య, సంస్కృతి, సేవా భావాల సమ్మేళనంగా ఎంతో ఘనంగా జరిగింది.

## గుత్తా వెంకట్ రెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు ఉచిత కోచింగ్

**ట్రస్ట్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి**

నల్గొండ జిల్లా

వుదయం వార్త ప్రతినిధి సెప్టెంబర్ 06

నల్గొండ పట్టణ కేంద్రంలో ప్రకాశం బజార్ లో ఉన్న టీఎన్జీవో భవనంలో నేడు గుత్తా వెంకట్ రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుపేద విద్యార్థులకు ఉచిత కోచింగ్ ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరిగింది చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి సారద్యంలో నిర్వహిస్తున్న ఉచిత కోచింగ్ (SI, Police Constable, Forest Beat Officer మరియు ఇతర ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యంగా కష్టపడుతున్న పేద విద్యార్థుల కొరకు ఈ రోజు నల్గొండ పట్టణములోని TNGO భవనం, మిర్యాలగూడ, దేవరకొండ లో ఫైనల్ స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించడం జరిగింది. స్క్రీనింగ్ పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు ఉచిత కోచింగ్ సెప్టెంబర్ 7వ తేది నుండి TNGO భవనం లో ఉచిత కోచింగ్ మంచి ఫ్యాకల్టీ తో నిర్వహించడం జరుగుతుంది అని గుత్తా వెంకట్ రెడ్డి మెమోరియల్ ట్రస్టు నిర్వాహకులు తెలిపారు.

## పేకాట ఆడుతూ పట్టుబడిన వారికి పోలీస్ కౌన్సిలింగ్



సత్తుపల్లి సెప్టెంబర్ 6 (వుదయం ప్రతినిధి)

వేంసూరు మండల కేంద్రంలో ఇటీవల పేకాట ఆడుతూ పోలీసులకు పట్టుబడిన పలువురు వ్యక్తులకు వేంసూరు సబ్–ఇన్స్పెక్టర్ ప్రదీప్ ఆదివారం పోలీస్ స్టేషన్‌లో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ పేకాట, జూద క్రీడల వల్ల కుటుంబాలు ఎలా చిన్నాభిన్నమవుతాయో, సమాజంలో ఎలాంటి చెడు ప్రభావం పడుతుందో వారికి వివరించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండి, మంచి జీవనం సాగించాలని వారికి హితవు పలికారు. ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలో శాంతిభద్రతలను కాపాడేందుకు మరియు నేరాలను అరికట్టేందుకు పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తోందని ఎస్ఐ ప్రదీప్ తెలిపారు. పాల్పడుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు.

# శాంతి సరోవర్‌లో 'సమర్థ నాయకత్వంతో పల్లె ప్రగతి' సదస్సు

**ముఖ్య అతిథిగా పాల్గొన్న పంచాయతీ రాజ్ మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి వర్యులు దనసరి అనసూయ సీతక్క...**



శంకర్ పల్లి (వుదయం) : గ్రామ సర్పంచులలో నాయకత్వ లక్షణాలను పెంపొందించడమే ధ్యేయంగా గచ్చిబౌలిలోని బ్రహ్మకుమారీస్ - శాంతి సరోవర్‌లో 'సమర్థ నాయకత్వంతో పల్లె ప్రగతి' (రూరల్ డెవలప్‌మెంట్ త్రూ ఎఫెక్టివ్ లీడర్‌షిప్) పేరిట నిర్వహించిన ప్రత్యేక సెమినార్ ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. తెలంగాణ ప్రభుత్వ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి (పి.ఆర్ మరియు ఆర్.డి) శాఖ, బ్రహ్మకుమారీస్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ వింగ్ (ఆర్.ఈ.ఆర్.ఎఫ్) సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో తెలంగాణ పంచాయతీ రాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామాల సమగ్ర వికాసంలో ఆధ్యాత్మిక విలువలు, సానుకూల దృక్పథం యొక్క ప్రాముఖ్యతను వివరించడంతో పాటు సుస్థిర మరియు యోగిక్ వ్యవసాయ విధానాలపై సర్పంచులకు సమగ్ర అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ సదస్సును నిర్వహించారు. 34 ఎకరాల సువిశాల శాంతి సరోవర్ క్యాంపస్‌లోని 'గ్లోబల్ పీస్ ఆడిటోరియం'లో వేడుకగా జరిగిన ఈ విశేష కార్యక్రమానికి రాష్ట్రంలోని పలు జిల్లాల నుండి పెద్ద సంఖ్యలో సర్పంచులు, గ్రామీణ ప్రజాప్రతినిధులు విశేషంగా హాజరయ్యారు.

# అమలు కానీ హామీలతో తెలంగాణ రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం : సొసైటీ చైర్మన్ బద్దం శశిధర్ రెడ్డి

**వద్దురా నాయిన ఈ కాంగ్రెస్ పాలనా... వద్దురా నాయిన ఈ నయవంచన పాలనా....బి. ఆర్.ఎస్ పార్టీ మండల అధ్యకుడు గండిచర్ల గోవర్దన్ రెడ్డి .**



శంకర్ పల్లి (వుదయం) : రాష్ట్రంలో కాంగ్రెస్ విఫల పాలన సాగిస్తోందంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు శంకర్ పల్లి మండల పరిధిలోని మోకిల గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు 5వ రోజు భారీ నిరసన ప్రదర్శన, ధర్నా చేపట్టాయి. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గండిచర్ల గోవర్దన్ రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు, సొసైటీ చైర్మన్ బద్దం శశిధర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను తీవ్రస్థాయిలో ఎండగట్టారు. ఈ సందర్భంగా గండిచర్ల గోవర్దన్ రెడ్డి మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి చెందిన పల్లెలు, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో నిధులు లేక ప్రగతి కుంటుపడి పూర్తిగా విధ్వంసమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం బద్దం శశిధర్ రెడ్డి మాట్లాడుతూ.. పల్లెలు, పట్టణాల్లో పారిశుధ్య నిర్వహణ పూర్తిగా పడకేసిందని, ఎక్కడికక్కడ చెత్తాచెదారం పేరుకుపోయి అంటువ్యాధులు ప్రబలుతున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని మండిపడ్డారు. మాజీ ఎంపీపీ ధర్మానగారి గోవర్దన్ రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, రుణమాఫీని పూర్తిస్థాయిలో చేయకపోవడమే కాకుండా రైతుబీమా, కల్యాణలక్ష్మి వంటి సంక్షేమ పథకాల అమలుకు ఆటంకాలు కలిగిస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ నిరసన కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నర్సింలు, సీనియర్ నాయకులు వాసుదేవ్ కన్నా, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాణిక్ రెడ్డి, సర్పంచ్‌లు రాఘవేందర్ రెడ్డి, ఇంద్రసేనా రెడ్డి, ఎరుకల శేఖర్, కౌన్సిలర్లు విజయ్ కుమార్, మహేందర్ రెడ్డి, ప్రశాంత్, మాజీ కౌన్సిలర్ శ్రీనాథ్, మాజీ సర్పంచ్‌లు శ్రీధర్, నర్సింహా రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, బద్దం సురేందర్ రెడ్డి, అడ్వకేట్ ఉపేందర్ రెడ్డిలతో పాటు బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, యూత్ నాయకులు, మైనారిటీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# నిషేధిత మద్యం విక్రయం ఆపెదెవరు?

**"యథేచ్ఛగా మద్యం విక్రయాలపై మహిళా సంఘాల ఆగ్రహం"**
**"రోడ్లపై మందుబాబుల వీరంగం.. ఇబ్బందులు పడుతున్న ప్రజలు"**
**"ఎక్సైజ్, సంబంధిత . అధికారులు స్పందించాలి .. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకోవాలి"**



కోహిర్ (వుదయం) : కోహిర్ మండల పరిధిలోని పలు గ్రామాలు, పట్టణ కాలనీల్లో విచ్చలవిడిగా కొనసాగుతున్న అక్రమ బెల్ట్ షాపుల నిర్వహణపై స్థానిక మహిళలు, గ్రామస్తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా కిరాణా దుకాణాలు, ఇతర వ్యాపార కేంద్రాల్లో సైతం మద్యం విక్రయాలు సాగిస్తుండటంతో మహిళలు, విద్యార్థులు, యువత తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన చెందుతున్నారు. రాష్ట్రంలో బెల్ట్ షాపులను నియంత్రిస్తామని గతంలో ఇచ్చిన హామీని ప్రభుత్వం అమలు చేయాలని, ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తవుతున్నా ఆశించిన స్థాయిలో చర్యలు కనిపించడం లేదని విమర్శిస్తున్నారు. మద్యం సులభంగా అందుబాటులో ఉండటంతో పాటు తెలిసిన వారికి అప్పుగా ఇస్తుండటంతో మద్యం ప్రియుల సంఖ్య పెరుగుతోందని, ఉదయం నుంచే మద్యం తాగి రోడ్లపై హల్‌చల్ చేస్తూ గొడవలకు దిగుతుండటంతో సాయంత్రం వేళల్లో మహిళలు, వృద్ధులు బయటకు రావడానికి భయపడాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని వాపోయారు. లైసెన్స్ పొందిన మద్యం దుకాణాల నుంచి బెల్ట్ షాపులకు అక్రమంగా మద్యం సరఫరా చేస్తూ అధిక ధరలకు విక్రయిస్తున్నారని, దీనిపై ఎన్ని ఆరోపణలు వస్తున్నా ఎక్సైజ్, పోలీసు అధికారులు తగిన రీతిలో స్పందించకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి కోహిర్ మండలంలోని గ్రామాలు, పట్టణ కాలనీల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని, అక్రమ మద్యం విక్రయాలను అరికట్టి నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోహిర్ మండల ప్రజలు, మహిళలు డిమాండ్ చేస్తున్నారు.

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్న శంకర్ పల్లి కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ మధురవాణి..



శంకర్ పల్లి సెప్టెంబర్ 06 (వుదయం) శంకర్ పల్లి కస్తూరిబా గాంధీ పాఠశాల స్పెషల్ ఆఫీసర్ కె. మధురవాణి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మేము చేసే ప్రతి చిన్న పనిని ఎప్పటికప్పుడు గుర్తించి మమ్మల్ని మా స్కూల్ ని జిల్లా స్థాయి గుర్తింపు వరకు తీసుకెళ్లిన అందరికీ మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు.

## లయన్స్ ఇంటర్నేషనల్ క్లబ్ డిస్టిక్ 320A హైదరాబాద్ ఆధ్వర్యంలో టీచర్లకు సత్కారం..




మాగనూర్ (వుదయం) : సికింద్రాబాద్‌లోని లయన్స్ భవన్‌లో లయన్స్ డిస్ట్రిక్ట్ 320A గవర్నర్ లయన్ సురేష్ జిగ్నాని ఆధ్వర్యంలో ఆదివారం 'గురుదేవోభవ' కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. సమాజంలో ఎంతోమంది ఉన్నతమైన స్థానాల్లో నిలవడానికి గురువుల ప్రాముఖ్యత ఎంతో వర్ణనీయమైనదని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పద్మశ్రీ గ్రహీత, బ్రహ్మశ్రీ డాక్టర్ గరికపాటి నరసింహారావు చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయులకు ప్రశంసా పత్రాలు, అవార్డులు అందజేసి ఘనంగా సన్మానించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ మక్తల్ భీమా ద్వారా ఎంపికైన కోల్పూర్ పీఎస్ హెచ్ఎం ఇ. తిమ్మన్న, ముడుమాల్ ఎంపీపీఎస్ పీఎస్ హెచ్ఎం దండు శేఖర్‌లు గరికపాటి చేతుల మీదుగా ఈ సత్కారాన్ని అందుకున్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు, ఫస్ట్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ శశికాంత్, సెకండ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ నాగరాజు, రీజియన్ చైర్‌పర్సన్ లయన్ మోహన్ గౌడ్, పాస్ట్ గవర్నర్ రాధాకృష్ణ, డాక్టర్ మహేంద్ర కుమార్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు డాక్టర్ ప్రవీణ్ కుమార్, లయన్స్ క్లబ్ ఆఫ్ మక్తల్ భీమా కోశాధికారి లయన్ బి. అంబాదాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

## రామాయంపేట అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పాటు చేయాలి..



మెదక్ జిల్లా వుదయం రామయంపేట అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పాటు చేయాలని కోరుతూ నిజాంపేట మండల కేంద్రంలో ఆదివారం మండల జర్నలిస్టుల ఆధ్వర్యంలో రిలే దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో రామాయంపేట నియోజకవర్గంగా దానిని అప్పుడున్నటువంటి అధికారులు నాయకుల నిర్లక్ష్యం వల్ల మెదక్ లో కలపడం జరిగిందని డీలిమినేషన్ ద్వారా రామాయంపేట నియోజకవర్గం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నామన్నారు. ఈ దీక్షకు అఖిలపక్ష నాయకులకు కూడా మద్దతు తెలుపాలన్నారు. ఈ దీక్షకు బిఆర్ఎస్,కాంగ్రెస్, బిజెపి, నాయకులు సంఘీభావం తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

## బి ఆర్ ఎస్ ఆధ్వర్యంలో బాకీ కార్డుల పంపిణీ



వెల్దండ సెప్టెంబర్ 6 (వు దయం) కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానం మేరకు 420 వాగ్దానాలు నెరవేర్చలేదని బిఆర్ ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని అన్ని గ్రామాలలో బిఆర్ ఎస్ శ్రేణులు కార్యకర్తలతో కలిసి డబ్బు చప్పులతో ఇంటింటికి వెళ్లి బాకీ కార్డులు పంపిణీ చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి హామీలన్నీ నెరవేర్చాలని లేనియెడల టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు మండల పార్టీ అధ్యక్షులు పుట్ట రామిరెడ్డి, జంగిలి నిరంజన్, ఆనంద్, ప్రసాదు, జోగయ్య, ప్రభాకర్, నిరంజన్, తిమ్మినోని పల్లిలో గండికోట రాజు, అజిలాపూర్ లో రమేష్ గౌడ్, కుప్పగండ్ల ముక్తాల శేఖర్, తో పాటు ఆయా గ్రామాల్లో నిర్వహించారు

# ఘనంగా నాలుగో మహా పాదయాత్ర

**జహీరాబాద్ నుంచి బడంపేట్ వరకు భక్తిశ్రద్ధలతో పాదయాత్ర**



కోహిర్ వుదయం : జహీరాబాద్ శ్రీ రాచన్న స్వామి దేవాలయం నుంచి బడంపేట్ శ్రీ రాచన్న స్వామి దేవాలయం వరకు వీరశైవ లింగాయత సమాజం జహీరాబాద్ తాలూకా ఆధ్వర్యంలో నాలుగో మహా పాదయాత్రను ఘనంగా నిర్వహించారు. ఈ మహా పాదయాత్రను వీరశైవ లింగాయత జిల్లా సమాజం అధ్యక్షుడు ఇప్పపల్లి నర్సింలు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం సమాజ సభ్యులు భక్తిశ్రద్ధలతో పాదయాత్రలో పాల్గొని బడంపేట్ శ్రీ రాచన్న స్వామి దేవాలయానికి చేరుకున్నారు.

ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో వీరశైవ లింగాయత సమాజం సభ్యులు, భక్తులు పాల్గొని పాదయాత్రను విజయవంతం చేశారు. భక్తి, ఆధ్యాత్మికతతో సాగిన ఈ పాదయాత్ర ఆద్యంతం సందడిగా కొనసాగింది.

# ఆప్తమిత్రుడి మృతితో కన్నీటి పర్యంతమైన మాజీ ఎమ్మెల్సీ ఫారుఖ్ హుస్సేన్



అక్బర్ పేట-భూంపల్లి , సెప్టెంబర్ 6, వుదయం: తనకు అత్యంత ఆప్తుడైన సన్నిహితుడు మృతి చెందడంతో మాజీ ఎమ్మెల్సీ ఫారుఖ్ హుస్సేన్ ఒక్కసారిగా కన్నీటి పర్యంతమయ్యారు. సిద్దిపేట జిల్లా అక్బర్ పేట-భూంపల్లి మండల పరిధిలోని మోతె గ్రామానికి చెందిన భోధనం చిన్న నరసింహారెడ్డి గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఫారుఖ్ హుస్సేన్ ఆదివారం నరసింహారెడ్డి పార్థివదేహాన్ని సందర్శించి కన్నీటితో నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన పుట్టినరోజు వేడుకల నాడే అత్యంత ఆప్తుడైన మిత్రుడు మృతి చెందడం తనను కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. తన స్నేహితుడి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటానని భరోసా కల్పించారు.

నరసింహారెడ్డి మృతి విషయం తెలుసుకుని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పార్థివదేహానికి నివాళులర్పించారు. నరసింహారెడ్డి అకాల మరణం తీరని లోటని విచారం వ్యక్తం చేశారు. ఆయన వెంట సోలిపేట సతీష్ రెడ్డి, సర్పంచ్ మద్ది శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచ్ కాలేరు శ్రీనివాస్, నాయకులు రాజేశ్వర్, యాదయ్య, చంద్రం, నరసింహారెడ్డి, తిరుపతిరెడ్డి, నరేందర్ తదితరులు ఉన్నారు.

# ఘనంగా నాల్గవ మహా పాదయాత్ర

**జహీరాబాద్ రాచన్న స్వామి మఠం నుంచి బడంపేట రాచన్న స్వామి దేవాలయం వరకు పాదయాత్ర**





జహీరాబాద్ (వుదయం) : లోక కళ్యాణం, సమాజ ఐక్యత, ఆధ్యాత్మిక చైతన్యమే లక్ష్యంగా వీరశైవ లింగాయత్ సమాజం జహీరాబాద్ తాలూకా ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన నాల్గవ మహా పాదయాత్ర భక్తిశ్రద్ధల మధ్య అత్యంత వైభవంగా కొనసాగింది. స్థానిక రాచన్న స్వామి మఠం నుంచి బడంపేట శ్రీ రాచన్న స్వామి దేవాలయం వరకు సాగిన ఈ మహా పాదయాత్రను వీరశైవ లింగాయత్ సమాజం సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఇప్పపల్లి నరసింహులు జెండా ఊపి ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో విచ్చేసిన భక్తులు, సమాజ సభ్యులు స్వామివారి నామస్మరణతో ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రీయ బసవదళ్ అధ్యక్షులు శంకర్ పాటిల్, గౌరవ అధ్యక్షులు సులుగంటి సిద్ధేశ్వర్, కార్యనిర్వాహక అధ్యక్షులు పట్ల చంద్రశేఖర్, మాజీ అధ్యక్షులు ప్రసాద్ మధుశేఖర్, యువజన అధ్యక్షులు బుగ్గనగారి మల్లికార్జున్, కోశాధికారి పోలీస్ సంతోష్ కుమార్, సలహాదారులు అనిమిశెట్టి జయప్రకాష్, నాయికోటి రామప్ప, జహీరాబాద్ తాలూకా అధ్యక్షులు ఆగురు శివరాజ్, పట్టణ సమాజ అధ్యక్షులు రాజశేఖర్ సెట్‌కార్, ప్రధాన కార్యదర్శి ఆర్. సుభాష్, సిద్దాపురం అరుణ్ కుమార్, రైకోడ్ మండల అధ్యక్షులు దదువై పవన్ కుమార్, జిల్లా యువజన జాయింట్ సెక్రటరీ పోలీస్ ప్రవీణ్ కుమార్, చెన్నప్ప, శివకుమార్ స్వామి, పట్లోళ్ల శివకుమార్, ఎదుల సంగమేశ్వర్, పట్లోళ్ల నాగేశ్వర్, మహిళా గౌరవ అధ్యక్షురాలు అరుణా కౌలాస్‌లతో పాటు పలువురు సమాజ నాయకులు, భక్తులు పాల్గొని పాదయాత్రను విజయవంతం చేశారు.